# విశాల భారతి

తెలుగు దినపత్రిక

17-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ — సంపుటి:4 సంచిక: 72




## ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్!

- అసెంబ్లీకి ప్రిపేర్ అయి రావాలి: సీఎం ఆదేశం
- చిట్ చాట్‌లు వద్దు.. పనితీరుపై ఫోకస్ పెట్టండి
- గైర్హాజరైన ఆరుగురు ఎమ్మెల్యేలపై రేవంత్ సీరియస్
- ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా కౌంటర్ ఇవ్వాలి
- వ్యవస్థ గౌరవం పెంచేలా ప్రసంగాలు ఉండాలి
- బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

02

## దీదీ కోటలో కమలం వ్యూహం..!

### బెంగాల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల; ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్

- బీజేపీ తొలి జాబితా విడుదల.. 144 మంది అభ్యర్థుల ప్రకటన
- భవానీపూర్‌లో మమతా బెనర్జీ వర్సెస్ సువేందు అధికారి పోరు
- రెండు చోట్ల నుంచి పోటీ చేయనున్న సువేందు.. నందిగ్రామ్, భవానీపూర్ సిద్ధం
- పాతకాపులకే పెద్దపీట.. 41 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం
- మే 4న వెలువడనున్న తుది ఫలితాలు.. దేశవ్యాప్తంగా ఉత్కంఠ

03





## ఒంటరవుతున్న అగ్రరాజ్యం?

- యుద్ధనౌకల పంపిణీపై అమెరికా విన్నపాన్ని తిరస్కరించిన 7 దేశాలు.
- హర్మూజ్ జలసంధికి నౌకలను పంపే ప్రసక్తే లేదని కేథరిన్ కింగ్ వెల్లడి
- సైనిక జోక్యంపై ఎవరికీ హామీ ఇవ్వలేదన్న ప్రధాని సనాయీ తకాయిచి

04

## అక్షర యోధుడికి అత్యున్నత గౌరవం

- తెలంగాణ ఉద్యమ సాహిత్యంలో తిరుగులేని గొంతుక
- తెలంగాణ సాహిత్య అకాడమీ మొదటి అధ్యక్షుడిగా సేవలు
- స్వచ్ఛమైన యాసతో కవిత్వాన్ని జనానికి చేరువ చేశారు
- 'నాగేటి చాల్లల్లో..' వంటి అద్భుత గీతాల సృష్టికర్త
- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
- సామాజిక చైతన్యమే లక్ష్యంగా సాగిన అక్షర యాత్ర

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సాహిత్య యవనికపై నందిని సిధారెడ్డి అనే పేరు ఒక చెరగని సంతకం. కేవలం అక్షరాలను పేర్చడమే కాకుండా, ఆ అక్షరాల్లో ఆత్మగౌరవాన్ని, మట్టి వాసనను నింపి పాఠకుడి గుండెల్లో సెగలు పుట్టించగల సత్తా ఆయన కలం సొంతం. మెదక్ జిల్లా బందారంలో పుట్టి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆలోచనలకు పదును పెట్టుకున్న ఈ అక్షర సేద్యగాడు, ఒక దశాబ్దం పాటు సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో సాహిత్య సలహాదారుగా, ఉద్యమకారుడిగా కీలక పాత్ర పోషించారు. సిద్ధారెడ్డి రాసిన ప్రతి కవితా మిగతా 3లో..





## ఆంధ్రాకు దాసోహమైన రేవంత్ రెడ్డి

- నీటి హక్కులను తాకట్టు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- గోదావరి జలాలపై ఏపీ కుట్రలను అడ్డుకోవడంలో విఫలం
- ఢిల్లీ మీటింగ్ మినిట్స్‌పై నెల రోజులుగా మౌనం ఎందుకు?
- కేసీఆర్ తెచ్చిన 968 టీఎంసీల వాటాను కాపాడుకోలేని స్థితి
- చంద్రబాబు స్కెచ్‌కు రేవంత్ రెడ్డి దాసోహం అయ్యారా?
- తెలంగాణ ప్రాజెక్టుల మనుగడకే ముప్పు - బీఆర్ఎస్ హెచ్చరిక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ జీవనాడులైన కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారిందని బీఆర్ఎస్ పక్షాన మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిగతా 2లో..

# తెలంగాణ ప్రజలు శాంతికాముకులు

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా రోడ్డు మ్యాప్



- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 4.99 శాతం వాటాతో కీలక పాత్ర
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరడం ప్రగతికి నిదర్శనం
- వరంగల్, ఆదిలాబాద్‌లలో త్వరలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు
- జీహెచ్ఎంసీ 3 కార్పొరేషన్లుగా, మెట్రో పరిధి 4 కమిషనరేట్లుగా విభజన
- హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల రక్షణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రం సమగ్ర ప్రగతి పథంలో దూసుకుపోతూ, దేశానికే ఒక ఆర్థిక చోదక శక్తిగా మారుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, 'శ్రమించే తత్వం గల శాంతికాముక తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు' అంటూ అచ్చ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించి అందరినీ ఆకట్టుకున్నారు. రాష్ట్రం ప్రస్తుతం 'తెలంగాణ రైజింగ్' దిశగా అడుగులు వేస్తోందని, దేశ జీడీపీలో మన రాష్ట్రం 4.99 శాతం వాటాతో కీలక పాత్ర పోషిస్తుండటం మన ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వద్ద స్పష్టమైన రోడ్డు మ్యాప్ ఉందని, ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా సమతుల్యమైన బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం 'క్యూర్, ప్యూర్, రేర్' అనే వినూత్నమైన, ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి నమూనాను అనుసరిస్తోందని గవర్నర్ వివరించారు. ముఖ్యంగా పట్టణాభివృద్ధిలో 'క్యూర్' మోడల్‌ను ప్రవేశపెట్టడం ద్వారా నగరాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా, పెరుగుతున్న జనాభా మిగతా 3లో..

## ముంద్రా తీరానికి 'శివాలిక్' నౌక



- ఖతార్ నుంచి భారత్‌కు చేరిన భారీ ఎల్‌పీజీ ట్యాంకర్
- గుజరాత్ పోర్టులో గ్యాస్ సరఫరా ప్రక్రియ షురూ
- పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల నడుమ సాహసోపేత యాత్ర
- భారత యుద్ధ నౌకల పర్యవేక్షణలో సురక్షిత రవాణా
- దేశీయ గ్యాస్ అవసరాలకు భారీ ఊరటనిచ్చిన విజయం
- అంతర్జాతీయ సంక్షోభంలోనూ భారత్ దౌత్య గెలుపు

**విశాలభారతి, జాతీయం:**

మధ్యప్రాచ్యం అంటేనే ఇప్పుడు ఒక మండుతున్న అగ్నిగుండం. ఏ క్షణాన ఏ క్షిపణి ఎటు నుంచి దూసుకువస్తుందో తెలియని సందిగ్ధావస్థ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నడుస్తున్న నీడ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఇలాంటి భయానక యుద్ధ మేఘాల మధ్య భారత్‌కు ఒక అత్యంత తీపి కబురు అందింది. ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ పోర్టు నుంచి వేల టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ లోడ్‌తో బయలుదేరిన భారత దిగ్గజ ట్యాంకర్ 'శివాలిక్', అన్ని అడ్డంకులను మిగతా 2లో..



## ఈనెల 20న రాష్ట్ర బడ్జెట్



- 20న ప్రవేశపెట్టి 31 వరకు నిర్వహణ
- సీఎల్పీకి రాని ఎమ్మెల్యేలపై సీఎం ఆగ్రహం
- కనీసం 30 రోజులు సభ జరపాలని డిమాండ్
- చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని రేవంత్ సూచన
- పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు అవకాశం కోరిన బీఆర్ఎస్
- గత వైఫల్యాలు వదిలి భవిష్యత్తుపైనే చర్చ

02

## కాంగ్రెస్‌ను నిలదీస్తాం

- గన్‌పార్క్‌లో అమరవీరులకు బీఆర్ఎస్ నేతల నివాళి
- రాహుల్ బంధు వద్దు.. రైతుబంధు కావాలని నినాదాలు
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?: కేటీఆర్ ప్రశ్న
- రైతులను వదిలి ఢిల్లీకి రూ.వేల కోట్లా? అని ధ్వజం
- అద్భుతమైన రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శ
- అసెంబ్లీ సాక్షిగా ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టీకరణ

03




**విశాల భారతి**

తెలుగు దిన పత్రిక

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో పనిచేయుటకు అనుభవం ఆసక్తి ఉన్న జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు,మండల విలేకరులు కావలెను.
కొత్తవారికికూడా అవకాశం కలదు..

పనిచేయు మండలాలు:
ఖమ్మం జిల్లా : జిల్లా స్టాఫర్, క్రైమ్,ఖమ్మం రూరల్,మండలాలు తిరుమలయపాలెం ,వైరా, కొణిజర్ల, ముదిగొండ, రఘునాథపాలెం, ఎర్రుపాలెం,మధిర, తల్లాడ, బోనకల్లు, చింతకాని, కామేపల్లి, కల్లూరు పెనుబల్లి, వేంసూరు,ఏన్కూరు మండల విలేకర్లు కావలెను.
కొత్తగూడెం జిల్లాలో: కొత్తగూడెం,కొత్తగూడెం టౌన్, సింగరేణి, క్రైమ్, జూలూరుపాడు, సుజాత నగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి,టేకులపల్లి,ఇల్లందు చంద్రుగొండ,అన్నపూరెడ్డిపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, చర్ల, పినపాక.

పైన తెలిపిన మండలాల్లో నిజాన్ని నిర్భయంగా రాసే దమ్మున్న ఆసక్తి గల విలేకర్లు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్:
93989 08071
వివరాల కోసం: epaper.vishalabharati.com

# యుద్ధం తక్షణమే ఆపాలి

**పాల్వంచ, విశాలభారతి:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాదిని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లది యుద్ధోన్మాదమని, ఈ చర్యలు ప్రపంచ శాంతిని తీవ్రంగా విచ్ఛిన్నం చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో పాల్వంచలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా కేంద్రం మౌనం వహించడం శోచనీయమని, అమెరికా ఒత్తిళ్లకు లొంగి కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు నావికా విన్యాసాలకు వచ్చి వెళుతున్న ఇరాన్ నౌకను దేశ సముద్ర తీరంలో అమెరికా కూల్చివేస్తే కేంద్ర ప్రభుత్వం కనీసం ఖండించకపోవడం సిగ్గుచేటని, 160 మంది పిల్లలను బలి తీసుకున్నప్పుడు అమెరికా ఒత్తిడితో మాట్లాడకుండా మోకరిల్లడం దేశ సార్వభౌమాధికారానికి భంగకరమని విమర్శించారు. దేశ ప్రయోజనాలను అగ్రరాజ్యానికి తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో సామాన్యుడిపై ధరల భారం పెరుగుతోందని, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల వంటింటిపై మోయలేని భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ధరల పెరుగుదలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సామ్రాజ్యవాద దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలన్నీ ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా ఉప్పుశెట్టి రాహుల్, మున్సిపల్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు శనగారపు శ్రీనివాసరావు నరహరి నాగేశ్వరరావు, గౌతమి కృష్ణ వల్లపు యాకయ్య గిరి ఉప్పుశెట్టి సునీల్, మద్దినేని నాగమణి, వగ్గల పద్మ, రామారావు, బార్ల వెంకటరత్నం, హైమద్ జానీ, నామ పండు, రవీందర్, బాబురావు, గాజుల సత్యనారాయణ, బిక్కులాల్, అమీర్, వెంకటేష్, అంబడిపూడి నరేంద్ర, అద్దంకి బాబు, కాకాటి రాజేష్, భట్టు శంకర్, కోమటి శ్రీను, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 20న రాష్ట్ర బడ్జెట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఏసీ సమావేశం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించి సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ భేటీకి కొందరు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నిస్తూ, ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించవద్దని గట్టిగా హెచ్చరించారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశానికి శాస్త్రీయమైన సమాచారంతో, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే సమాధానం ఇచ్చేలా సభ్యులందరూ పూర్తి డేటాతో సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. విమర్శలకు కేవలం ఆరోపణలతో కాకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాలని సూచించారు. సభలో చర్చల సరళి ఎలా ఉండాలో సీఎం స్పష్టమైన రోడ్ మ్యాప్ ఇచ్చారు. గత పదేళ్ల ప్రభుత్వ వైఫల్యాల గురించి పదేపదే చర్చించి సభ సమయాన్ని వృధా చేయాల్సిన అవసరం లేదని, ప్రజల భవిష్యత్తు కోసం తమ ప్రభుత్వం ఏం చేయబోతుందో వివరించడమే ప్రధాన అజెండా కావాలని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం తమ ప్రభుత్వ లక్ష్యాలకు అద్దం పడుతుందని, అది ఒక రోడ్ మ్యాప్ లాంటిదని సభ్యులకు వివరించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా విప్‌లు సభ్యుల మధ్య సమన్వయం చేయాలని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా చేరేలా మాట్లాడాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

ముఖ్యమంత్రి తన గత అనుభవాలను గుర్తు చేసుకుంటూ సభ్యులకు కర్తవ్య బోధ చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం తన గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని, సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఎల్పీ నేతలుగా ఉన్న భట్టి విక్రమార్క, జానారెడ్డిలకు కూడా కనీసం మైక్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేస్తూ, తమ ప్రజా ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి ఉండకూడదని అన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడేలా మంత్రులు తగిన సమయం కేటాయించి ప్రోత్సహించాలని, తాను కూడా సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు.





సభలో మహిళా శాసనసభ్యుల ప్రాతినిధ్యం కేవలం హాజరుకే పరిమితం కాకూడదని, ప్రతి చర్చలో వారు క్రియాశీలక భాగస్వాములు కావాలని రేవంత్ రెడ్డి కోరారు. మహిళా సభ్యులు ప్రజా సమస్యలపై గళం విప్పితే అది ప్రభుత్వానికి మరింత మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ఉత్తమ ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పుడు తాము రూపొందించుకునే రోడ్ మ్యాప్ నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందని, కాబట్టి ప్రతి నిర్ణయం ప్రజల ప్రయోజనాల కోసం ఉండాలని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై స్పందిస్తూ, వేసవి నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి రాకుండా ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ లైన్ దాటకుండా, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సభా సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ప్రజలకు జవాబుదారీగా ఉండటమే తమ పార్టీ ప్రాధాన్యతని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు నొక్కి చెప్పారు.

బీఆర్ఎస్ నేత హరీష్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం సభా సమయాన్ని ఉద్దేశపూర్వకంగా తగ్గించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 31వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని చెబుతున్నప్పటికీ, అందులో ఐదు రోజులు సెలవులే ఉన్నాయని, వాస్తవానికి పని దినాలు చాలా తక్కువగా ఉంటాయని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మంత్రులు అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై స్పీకర్ కఠినంగా వ్యవహరించాలని కోరారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ ద్వారా అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి, నిరసన తెలపడానికి తగిన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు తమను ఆహ్వానించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తమ పార్టీ తరపున ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని హరీష్ రావు బీఏసీలో కోరారు. ప్రభుత్వం చర్చల నుంచి తప్పించుకునేందుకు బీఏసీ నిర్ణయాలను కూడా పక్కన పెడుతోందని ఆరోపించారు. సభా హక్కుల కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని, స్వల్పకాలిక చర్చ కోసం తాము ఇచ్చిన 19 అంశాలలో ప్రాధాన్యత గల అంశాలను చర్చకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు విడుదల చేయాలని కోరుతూ, తమ విజ్ఞప్తులను పట్టించుకోకపోతే సభను బహిష్కరిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీఏసీ నిర్ణయాలు మినిట్స్‌లో ఒకలా, అమలులో మరోలా ఉండటంపై మండిపడ్డారు. బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి సైతం ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కనీసం 30 రోజులు అసెంబ్లీ సమావేశాలు జరపాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం కేవలం ఐదారు రోజుల్లో బడ్జెట్ ఆమోదం పొంది తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం నిరుత్సాహకరంగా ఉందని, పేదలకు భరోసా ఇచ్చే ఒక్క అంశం కూడా అందులో లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం చేస్తున్న లక్షలాది కోట్ల అప్పుల గురించి గానీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు గురించి గానీ గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదని, ఇదొక దిశా నిర్దేశం లేని ప్రసంగమని ఆయన దుయ్యబట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే రోజుల్లో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తోంది. బడ్జెట్ కేటాయింపులు, ఆరు గ్యారెంటీల అమలు, రైతుల రుణమాఫీ వంటి కీలక అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తప్పదనిపిస్తోంది. స్పీకర్ సభ్యులందరికీ సమాన అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్థవంతమైన చర్చలు జరుగుతాయా లేక కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితం అవుతారా అన్నది వేచి చూడాలి. రాష్ట్ర ప్రజలందరి కళ్లు ఇప్పుడు ఈ బడ్జెట్ సమావేశాల పైన, ప్రభుత్వం ప్రకటించబోయే కొత్త పథకాల పైన ఉన్నాయి.

# ఆంధ్రాకు దాసోహమైన రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

ఆయన మాట్లాడిన తీరు, గణాంకాలతో సహా ప్రభుత్వంపై చేసిన విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తన బాధ్యతారాహిత్యంతో తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారపోస్తోందని, ముఖ్యమంత్రి తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రాణాలకు తెగించి కాపాడుకున్న హక్కులను, కేవలం వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నదీ జలాల విషయంలో గడిచిన పదేళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ, సమైక్య రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కేసీఆర్ ఎంతో శ్రమించారని హరీశ్ రావు పేర్కొన్నారు. కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా నీటి పునఃపంపిణీ సాధించడమే కాకుండా, గోదావరిలో బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు రావాల్సిన 968 టీఎంసీల వాటాను కాపాడింది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టులు నిర్మించి, సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు సాధించి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు బీఆర్ఎస్ కృషి చేసిందని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గోదావరి జలాలపై ఏపీ తన ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోతే భవిష్యత్తులో తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

కేంద్రంలోని బీజేపీ మరియు ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపి కూటమి ప్రభుత్వం కలిసి తెలంగాణకు ద్రోహం చేసేందుకు సిద్ధమయ్యాయని, దీనికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సహకరిస్తోందని హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కృష్ణా నదిలో ఇప్పటికే నీటి దోపిడీ జరుగుతుండగా, ఇప్పుడు ఏపీ ప్రభుత్వం తన దృష్టిని గోదావరి జలాల వైపు మళ్లించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షం నిలదీసినప్పుడల్లా ఉలిక్కిపడి లేచి, మొక్కుబడిగా కేంద్రానికి లేఖలు రాయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో పోరాడాల్సింది పోయి, కేవలం ఉత్తరాల డ్రామాలు



ఆడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని, నేటి తన విమర్శల తర్వాత కూడా సాయంత్రానికి మరో లేఖ రాసి చేతులు దులుపుకుంటారేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

గత జనవరి 30న ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారుల సమావేశం తెలంగాణకు శాపంగా మారిందని హరీశ్ రావు వివరించారు. గోదావరి జలాల్లో ఏ రాష్ట్రానికీ స్పష్టమైన కేటాయింపులు లేవని ఏపీ వాదిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కనీసం అభ్యంతరం చెప్పకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రశ్నించారు. ఈ సమావేశం తాలూకు మినిట్స్ ఫిబ్రవరి 12నే రాష్ట్ర ప్రభుత్వానికి అందినప్పటికీ, నెల రోజులు గడిచినా ఇంతవరకు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తెలంగాణ నీటి వాటాపై ఏపీ చేస్తున్న తప్పుడు వాదనలను మౌనంగా అంగీకరించడమేంటని, రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడుకు రాష్ట్రాన్ని దాసోహం చేశారా అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెట్టారని ఆయన మండిపడ్డారు.

రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులను కీలక పదవుల్లో కూర్చోబెట్టడం ద్వారా రేవంత్ ప్రభుత్వం 'దొంగ చేతికే తాళాలు ఇచ్చినట్లు' ప్రవర్తిస్తోందని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి, బనకచర్ల అంశాలు ఎజెండాలో లేకపోతేనే సమావేశానికి వెళ్తామని చెప్పిన ప్రభుత్వం, తీరా ఏపీ ప్రభుత్వం వాటిని చేర్చినా కూడా మోకాళ్ల మీద పరిగెత్తుకుంటూ వెళ్లి పాల్గొనడం సిగ్గుచేటన్నారు. మినిట్స్‌లోని మూడవ పేజీలో తెలంగాణకు వాటా లేదని ఏపీ చెప్పిన మాటలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, ఈ ప్రభుత్వం లోపాయికారీ ఒప్పందం చేసుకుందని అర్థమవుతోందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డును ప్రశ్నించే హక్కు గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు లేకపోయినా, ఈ ప్రభుత్వం ఎందుకు నోరు మూసుకుని ఉందని ప్రశ్నించారు.

ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్ నిబంధనలను ధిక్కరించడం అంటే రాజ్యాంగాన్నే ధిక్కరించడమని, ఇది ముమ్మాటికీ తెలంగాణ హక్కులను కాలరాయడమేనని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు సాధించామని, అప్పట్లో ఏపీకి ఉన్న 531 టీఎంసీల వాటాను పరిగణనలోకి తీసుకునే సీడబ్ల్యూసీ మాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గుర్తు చేశారు. 2023 నివేదిక ప్రకారం గోదావరిలో 3396 టీఎంసీల లభ్యత ఉండగా, అందులో ఏపీ వాటా పోను మిగిలినవన్నీ తెలంగాణవేనని స్పష్టంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు ఏపీ అదనంగా 775 టీఎంసీలు కావాలని కోరడం దుర్మార్గమన్నారు. కృష్ణాలో తెలంగాణకు ఉన్న 34 శాతం వాటాను కూడా కాపాడుకోలేక చేతులెత్తేసిన కాంగ్రెస్, ఇప్పుడు గోదావరిని కూడా ఏపీ పరం చేస్తోందని విమర్శించారు.

నీటి మళ్లింపును పర్యవేక్షించే టెలిమెట్రీల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 18 టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తే, వాటి నిర్వహణ కోసం కేటాయించిన నిధులను కేఆర్ఎంబీ అధికారులు తమ జీతాలకు వాడుకున్నా రేవంత్ సర్కార్ కిక్కురుమనడం లేదన్నారు. కొత్త టెలిమెట్రీల ఏర్పాటుపై అధికారులు తేల్చిచెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిరసన వ్యక్తమవ్వకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ప్రాజెక్టుల భవిష్యత్తు అంధకారంలో పడుతున్నా, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, ఇది తెలంగాణ రైతులకు చేస్తున్న తీరని ద్రోహమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ముంద్రా తీరానికి 'శివాలిక్' నౌక

**మొదటిపేజీ తరువాయి**

అధిగమించి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఇది కేవలం ఒక నౌక ప్రయాణం మాత్రమే కాదు, అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ భారత్ సాధించిన వ్యూహాత్మక విజయమని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రపంచ దేశాల ఇంధన అవసరాలను తీర్చే హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఇరాన్ తన సైనిక పటిమను ప్రదర్శిస్తూ, ఈ మార్గాన్ని మూసివేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్న వేళ, అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు అటువైపు వెళ్లాలంటేనే జంకుతున్నాయి. గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే చమురు, గ్యాస్ సరఫరాకు ఈ జలసంధి ప్రాణాధారం. ఒకవేళ ఇక్కడ రవాణా స్తంభిస్తే భారత్‌లో గ్యాస్ కొరత ఏర్పడి ధరలు ఆకాశాన్ని తాకుతాయని అందరూ ఆందోళన చెందుతున్న తరుణంలో, శివాలిక్ నౌక రాక దేశానికి పెద్ద ఊరటనిచ్చింది.

ఈ విజయం వెనుక భారత నావికాదళం శ్రమ, కేంద్ర ప్రభుత్వ దౌత్య చాణక్యం స్పష్టంగా కనిపిస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో భారత నౌకలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఇండియన్ నేవీ నిరంతరం నిఘా ఉంచుతోంది. 'ఆపరేషన్ సంకల్ప్' వంటి కార్యక్రమాల ద్వారా మన యుద్ధ నౌకలు వాణిజ్య నౌకలకు రక్షణ కవచంలా నిలుస్తున్నాయి. శివాలిక్ ట్యాంకర్ ప్రయాణాన్ని కూడా భారత నౌకాదళం క్షణం క్షణం పర్యవేక్షించింది. డ్రోన్ దాడులు, సముద్రపు దొంగల ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో భారత నావికాదళం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడం వల్లనే ఈ భారీ గ్యాస్ నిల్వలు సురక్షితంగా తీరానికి చేరాయి. శివాలిక్ నౌక ప్రయాణించిన మార్గం సాధారణమైనది కాదు. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో దాదాపు 20 శాతం హోర్ముజ్ జలసంధి గుండానే వెళుతుంది. ఇరాన్ తీరానికి అతి సమీపంలో ఉండే ఈ సన్నని సముద్ర మార్గం ఇప్పుడు ప్రపంచ దేశాల మధ్య రణరంగంగా మారింది. అగ్రరాజ్యం అమెరికా తన యుద్ధ విమాన వాహక నౌకలను



అక్కడ మోహరించగా, ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను సిద్ధం చేసింది. ఇలాంటి హైవోల్టేజ్ డ్రామా నడుస్తున్న చోట నుంచి భారీ ఎల్‌పీజీ ట్యాంకర్‌ను నడిపించడం అంటే కత్తి మీద సామే. అయినప్పటికీ, భారతీయ నావికులు తమ ధైర్యసాహసాలను ప్రదర్శించి లక్ష్యాన్ని ముద్దాడారు. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టుకు శివాలిక్ చేరుకోగానే అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ నౌక నుంచి గ్యాస్ అన్‌లోడింగ్ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన సాగుతోంది. ఈ గ్యాస్ నిల్వలు దేశవ్యాప్తంగా ఉన్న గృహ అవసరాలకు, పారిశ్రామిక రంగానికి ఇంధనంగా మారనున్నాయి. పండుగల సీజన్ దగ్గర పడుతున్న వేళ గ్యాస్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో ఖతార్ నుంచి గ్యాస్ సరఫరా అందడం అంటే మార్కెట్‌లో ధరల స్థిరీకరణకు కూడా ఇది ఎంతో దోహదపడుతుంది. భారత్ తన శక్తి అవసరాల కోసం గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధారపడుతున్న తరుణంలో ఇలాంటి విజయాలు ఎంతో అవసరం.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు నిలకడగా లేకపోవడానికి ప్రధాన కారణం యుద్ధ భయాలే. ఒకవేళ యుద్ధం ముదిరితే బ్యారెల్ చమురు ధర 100 డాలర్లు దాటుతుందని అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే పలు దేశాలు తమ షిప్పింగ్ రూట్లను మార్చుకుని ఆఫ్రికా చుట్టూ ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి వినియోగదారులపై భారం పడుతోంది. అయితే భారత్ మాత్రం ఇరాన్, అరబ్ దేశాలతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగించుకుంటూ, తక్కువ ఖర్చుతో కూడిన పాత మార్గాల ద్వారానే రవాణాను కొనసాగించే ప్రయత్నం చేస్తోంది. శివాలిక్ నౌక విజయం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

ఈ ప్రయాణంలో భారత నిఘా వ్యవస్థలు పోషించిన పాత్ర మరువలేనిది. అత్యాధునిక శాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా నౌక కదలికలను ఢిల్లీలోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. సముద్రంలో అనుమానాస్పద బోట్లు లేదా క్షిపణి కదలికలు కనిపిస్తే వెంటనే నౌక గమనాన్ని మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా ఎల్‌పీజీ అనేది అత్యంత పేలుడు పదార్థం కావడంతో చిన్న పొరపాటు జరిగినా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి అడుగులోనూ భద్రతా ప్రమాణాలను తూచా తప్పకుండా పాటించి, ట్యాంకర్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇంధన వినియోగదారుగా ఉంది. మన దేశ వృద్ధి రేటు వేగంగా పుంజుకుంటున్న తరుణంలో ఇంధన భద్రత అనేది అత్యంత కీలకం. శివాలిక్ వంటి నౌకలు నిరంతరాయంగా సరఫరాను కొనసాగిస్తేనే దేశ ఆర్థిక చక్రం ముందుకు సాగుతుంది. గల్ఫ్ సంక్షోభం భారత్‌కు ఒక పరీక్షా కాలం లాంటిది. ఈ పరీక్షలో మనం నెగ్గాలంటే దౌత్యం, రక్షణ మరియు వాణిజ్యం మధ్య సమన్వయం ఉండాలి. శివాలిక్ విజయవంతంగా ముంద్రా చేరుకోవడం అనేది భారత్ ఏ పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని ప్రపంచానికి చాటి చెప్పింది.

# ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభాపక్ష సమావేశం సాక్షిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై ఆయన నిశితంగా స్పందిస్తూ పలువురు ఎమ్మెల్యేల తీరుపై బాహాటంగానే అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లోపల, బయట అనవసరమైన అంశాలపై చర్చలు మాని, ప్రజలకు ఉపయోగపడే అంశాలపై దృష్టి సారించాలని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. సభకు వచ్చేటప్పుడు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, విషయ పరిజ్ఞానంతో రావాలని, కేవలం హాజరు కోసమే రావడం సరికాదని ఆయన చురకలంటించారు. సమావేశం ప్రారంభమైనప్పటి నుంచి ముఖ్యమంత్రి స్వరం కాస్త కఠినంగానే సాగింది. ముఖ్యంగా మీడియా ప్రతినిధులతో నిర్వహించే అనధికారిక 'చిట్‌చాట్'ల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు బయట చేసే అడ్డగోలు వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, వ్యవస్థపై ప్రభావం చూపేలా మాట్లాడాలని హితవు పలికారు. రాజకీయాల్లో మనం మాట్లాడే ప్రతి మాట వ్యక్తిగత ఇమేజ్‌ను మాత్రమే కాకుండా, మొత్తం ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్యేల పట్ల మంత్రుల వైఖరిపై కూడా ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. తమ నియోజకవర్గాల్లోని ప్రజా సమస్యలను వివరించడానికి



వచ్చే ఎమ్మెల్యేలకు మంత్రులు తగిన సమయం కేటాయించాలని ఆయన ఆదేశించారు. కేవలం వినడమే కాకుండా, వారు చెప్పే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఇకపై తాను కూడా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తానని, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని భరోసా ఇచ్చారు. ఈ సమన్వయం ఉంటేనే ప్రభుత్వం ప్రజలకు చేరువవుతుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల విమర్శల విషయంలో ఎమ్మెల్యేలు రక్షణాత్మక ధోరణి వీడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సభలో ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశానికి గణాంకాలతో సహా దీటైన సమాధానం ఇవ్వాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నాయకులైన జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క వంటి హేమాహేమీలకు కూడా మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేశారని ఆయన గుర్తు చేశారు. కానీ తమ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉందని, అందుకే ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు పూర్తి సమయం ఇస్తున్నామని, దానిని అదునుగా చేసుకుని వారు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు.

సమావేశానికి గైర్హాజరైన ఆరుగురు ఎమ్మెల్యేలపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎల్పీ సమావేశం కంటే ముఖ్యమైన పనులు ఏముంటాయని ఆయన ప్రశ్నించారు. ప్రజలు మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసి గెలిపించింది సభలో వారి గళం వినిపించడానికి అని, అటువంటి బాధ్యతను విస్మరించడం సహించరానిదని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే తప్ప, మిగిలిన ఏ కారణం చేతనైనా సభకు లేదా పార్టీ సమావేశాలకు రాకపోవడం క్రమశిక్షణారాహిత్యమే అవుతుందని ఆయన తేల్చి చెప్పారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని, అసెంబ్లీకి ప్రతి ఒక్కరూ విధిగా హాజరు కావాలని అల్టిమేటం జారీ చేశారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ, రాబోయే బడ్జెట్ అత్యంత వినూత్నంగా ఉండబోతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వాల మూస పద్ధతులకు భిన్నంగా, సామాన్యుడి అవసరాలను తీర్చే విధంగా పద్దులు ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా విద్య మరియు వైద్య రంగాలకు ఈ బడ్జెట్‌లో సింహభాగం కేటాయింపులు ఉంటాయని, మానవ వనరుల వికాసమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రజల్లోకి సానుకూల సంకేతాలు వెళ్తాయని, దానిని నియోజకవర్గాల్లో ప్రచారం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన గుర్తు చేశారు.

# దీదీ కోటలో కమలం వ్యూహం..!

**విశాలభారతి, జాతీయం:**

భారత రాజకీయాల్లో అత్యంత ఆసక్తిని రేకెత్తించే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రణభేరి మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నాడు వెస్ట్ బెంగాల్‌తో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ముఖ్యంగా బెంగాల్ గడ్డపై అధికారాన్ని చేజిక్కించుకోవాలని తహతహలాడుతున్న భారతీయ జనతా పార్టీ, తన పట్టును నిలుపుకోవాలని భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ మధ్య పోరు మునుపెన్నడూ లేని విధంగా రసవత్తరంగా మారింది. షెడ్యూల్ వెలువడిన కొద్ది గంటల్లోనే బీజేపీ తన అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసిరింది. 144 మంది అభ్యర్థులతో కూడిన ఈ జాబితాలో పార్టీ గెలుపు గుర్రాలకే ప్రాధాన్యతనిచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో అందరి కళ్లు మరోసారి మమతా బెనర్జీ వర్సెస్ సువేందు అధికారి వైపే ఉన్నాయి. గత ఎన్నికల్లో నందిగ్రామ్ వేదికగా దీదీకి ఊహించని షాక్ ఇచ్చిన సువేందు, ఈసారి కూడా ఆమెను సొంత నియోజకవర్గంలోనే ఢీకొట్టేందుకు సిద్ధమయ్యారు. మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నియోజకవర్గం నుంచి సువేందును బీజేపీ రంగంలోకి దింపడం ఇప్పుడు





రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కేవలం భవానీపూర్‌కే పరిమితం కాకుండా, తన పాత అడ్డా అయిన నందిగ్రామ్ నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం విశేషం. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో మమతా, మరోవైపు మాజీ అనుచరుడు, ప్రస్తుత ప్రత్యర్థి సువేందు మధ్య జరుగుతున్న ఈ యుద్ధం బెంగాల్ రాజకీయాల్లో క్లైమాక్స్ సీన్‌ను తలపిస్తోంది.

బీజేపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాను నిశితంగా పరిశీలిస్తే, పార్టీ కేడర్‌ను నమ్ముకోవడంతో పాటు అనుభవం ఉన్న నాయకులకు మళ్లీ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించిన 41 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీ మరోసారి టికెట్లు ఇచ్చింది. నియోజకవర్గాల్లో వారికున్న పట్టు, స్థానిక ప్రజల్లో ఉన్న ఆదరణే గెలుపుకు సోపానాలని పార్టీ హైకమాండ్ భావిస్తోంది. కొత్త ముఖాలతో ప్రయోగాలు చేయడం కంటే, క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న నాయకులకే పట్టం కట్టడం ద్వారా అధికారానికి చేరువ కావచ్చని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో ప్రధానంగా యువతకు, సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలోని కీలక నేతలకు కూడా ప్రాధాన్యత కలిగిన స్థానాలను కేటాయించింది బీజేపీ అధిష్ఠానం. పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కీలక నేత దిలీప్ ఘోష్ ఖరగ్‌పూర్ సదర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. అలాగే, సినీ గ్లామర్‌తో పాటు రాజకీయంగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అగ్నిమిత్రపాల్ అసన్సోల్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మేధావి వర్గానికి చెందిన స్వపల్ దాస్ గుప్తా రాష్‌బెహారీ స్థానం నుంచి పోటీ చేస్తుండటంతో ఆయా నియోజకవర్గాల్లో పోటీ ఉత్కంఠభరితంగా మారింది. వీరందరూ తమ తమ ప్రాంతాల్లో ఇప్పటికే ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. బెంగాల్ సంస్కృతిని, అస్తిత్వాన్ని కాపాడతామనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తూ దీదీ కోటను బద్ధలు కొట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

గత 2021 ఎన్నికల ఫలితాలను గుర్తు చేసుకుంటే, అప్పట్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 215 స్థానాల్లో ఘనవిజయం సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే, అప్పట్లో కేవలం 3 స్థానాల దగ్గర ఆగిపోయిన బీజేపీ, ఏకంగా 77 స్థానాలకు ఎగబాకి ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఆ ఊపును ఈ ఎన్నికల్లో కొనసాగించాలని, ఈసారి మేజిక్ ఫిగర్‌ను దాటాలని కమలం పార్టీ పక్కా ప్రణాళికతో ఉంది. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై దృష్టి సారించింది. అటు టీఎంసీ కూడా తన సంక్షేమ పథకాలు, మహిళా ఓటర్ల మద్దతుతో హ్యాట్రిక్ విజయం సాధించాలని పట్టుదలతో ఉంది. దీంతో ఇరు పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారింది.

ఎన్నికల నిర్వహణ విషయానికి వస్తే, కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 23న మొదటి దశ, ఏప్రిల్ 29న రెండో దశ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని శాంతిభద్రతలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను విడుదల చేస్తారు. ఈ మధ్య కాలంలో జరిగే ప్రచారం, ఇచ్చే హామీలు బెంగాల్ భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఈసీ అధికారులను ఆదేశించింది.

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఎప్పుడూ భావోద్వేగాలతో ముడిపడి ఉంటాయి. 'సోనార్ బంగ్లా' నిర్మిస్తామని బీజేపీ చెబుతుంటే, 'బంగ్లా నిజ కూతురు' (బెంగాల్ తనయ)గా మమతా బెనర్జీ ప్రచారం చేస్తున్నారు. స్థానిక సెంటిమెంట్‌ను, జాతీయ అభివృద్ధిని మేళవించి ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. గ్రామీణ ప్రాంతాల్లో తృణమూల్ బలంగా కనిపిస్తున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో బీజేపీ హవా పెరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో చూపిన జాగ్రత్తలు, నియోజకవర్గాల కేటాయింపులో అనుసరించిన వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయో చూడాలి. ముఖ్యంగా యువ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది అత్యంత కీలకంగా మారింది.

భవానీపూర్ నియోజకవర్గంపై ఇప్పుడు దేశం మొత్తం దృష్టి సారిస్తోంది. ఇక్కడి నుంచి మమతా బెనర్జీని ఓడిస్తేనే రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ క్యాడర్ నైతిక స్థైర్యం దెబ్బతింటుందని బీజేపీ వ్యూహకర్తలు భావిస్తున్నారు. అందుకే అక్కడ సువేందు అధికారి వంటి బలమైన నేతను నిలిపారు. సువేందు కూడా తన శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు. నందిగ్రామ్‌లో తాను చేసిన మేజిక్‌ను భవానీపూర్‌లో కూడా పునరావృతం చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. అటు మమతా బెనర్జీ కూడా ఏమాత్రం తగ్గడం లేదు. తన సొంత నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎవరూ చెడగొట్టలేరని, బెంగాల్ గడ్డపై బయటి వ్యక్తుల పెత్తనం సాగదని ఆమె విమర్శలు గుప్పిస్తున్నారు.

అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలతో పోలిస్తే బెంగాల్ పోరు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది కేవలం ఒక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నిక మాత్రమే కాదు, కేంద్రంలోని అధికార పార్టీకి, రాష్ట్రంలోని బలమైన ప్రాంతీయ పార్టీకి మధ్య జరుగుతున్న మినీ సార్వత్రిక ఎన్నికల వంటిది. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే జాతీయ రాజకీయాల దిశను కూడా నిర్దేశించే అవకాశం ఉంది. బీజేపీ గెలిస్తే అది తూర్పు భారతదేశంలో ఒక పెనుమార్పునకు సంకేతం అవుతుంది. ఒకవేళ మమత మళ్లీ నెగ్గితే, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతకు ఆమె కీలక నేతగా ఎదిగే అవకాశం ఉంటుంది. అందుకే ఇరు పార్టీలు ప్రతి అడుగును ఆచితూచి వేస్తున్నాయి.

# తెలంగాణ ప్రజలు శాంతికాముకులు

**మొదటిపేజీ తరువాయి**

అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 2031 నాటికి తెలంగాణలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందనే అంచనాల నేపథ్యంలో, పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోందని ఆయన స్పష్టం చేశారు. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడమే ఈ నమూనా ప్రధాన ఉద్దేశమని ఆయన సభకు వివరించారు. పరిపాలనా సౌలభ్యాన్ని పెంపొందించడం మరియు ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భారీ మార్పులు చేపడుతున్నట్లు గవర్నర్ ప్రకటించారు. నగరాన్ని మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించడంతో పాటు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత పరిధిని నాలుగు పోలీస్ కమిషనరేట్లుగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ విభజన ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్టం కావడమే కాకుండా, పౌర సేవల్లో వేగం , పారదర్శకత పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పెరుగుతున్న మహానగర విస్తీర్ణానికి అనుగుణంగా తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మరింత వెలుగొందేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల నిరోధం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా, రాజీలేని ధోరణితో వ్యవహరిస్తోందని గవర్నర్ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన 'హైడ్రా' వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు సుమారు 1,045 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణల నుండి విడిపించామని ఆయన వెల్లడించారు. ఈ భూముల మార్కెట్ విలువ దాదాపు రూ.60 వేల కోట్లు ఉంటుందని, ఇది సామాన్య ప్రజల ఆస్తి అని ఆయన గుర్తు చేశారు. ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కారని, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం చేస్తున్న ఈ పోరాటం రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనకు, పారదర్శకతకు నిదర్శనమని గవర్నర్ సభలో స్పష్టం చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తొలగించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ పట్టణాల్లో త్వరలోనే కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ విమానాశ్రయాల రాకతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, స్థానిక యువతకు భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇప్పుడు ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని, హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుందని ఆయన ప్రశంసించారు.

శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ ఆవరణలో నూతనంగా ప్రతిష్టించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్, ముఖ్యమంత్రి కలిసి ఆవిష్కరించారు. ఈ విగ్రహం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, దశాబ్దాల పోరాట పటిమకు సజీవ ప్రతీకగా నిలుస్తుందని, సభలోని సభ్యులంతా హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని తిలకించారు.

గవర్నర్ తన ప్రసంగంలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై గణాంకాలతో కూడిన వివరణ ఇచ్చారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకోవడం అనేది ప్రభుత్వం అనుసరిస్తున్న సమర్థవంతమైన, దూరదృష్టి కలిగిన ఆర్థిక విధానాల ఫలితమని ఆయన కొనియాడారు. కేవలం సంఖ్యల వృద్ధి మాత్రమే కాకుండా, ఆ వృద్ధి ఫలాలు సామాన్య మానవుడి దరికి చేరినప్పుడే అభివృద్ధికి సార్థకత ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్ది, వారికి ఉపాధి కల్పించడంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని గవర్నర్ తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. రాష్ట్రంలో నెలకొన్న మత సామరస్యం , పటిష్టమైన శాంతిభద్రతల వల్లే అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని గవర్నర్ విశ్లేషించారు. శాంతియుత వాతావరణం ఆర్థిక వృద్ధికి పునాది అని, తెలంగాణ ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అండగా నిలిచేందుకు అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి, ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా సభకు వివరించారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో సామాజిక సంక్షేమానికి పెద్దపీట వేయడం ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని చెప్పారు. ప్రతి పౌరుడికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా, మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ లేకుండా ముందుకు సాగుతున్నామని గవర్నర్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

## రైతులను విస్మరించిన బీటీపీఎస్ యంత్రాంగం

- ప్రజలమౌలిక ఏర్పాట్లలో ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్యం విఫలం
- ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కు మాజీ జెడ్పీటీసి దుర్గ వినతి



**మణుగూరు, విశాలభారతి :** భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరుగుతుందని, బీటీపీఎస్ యంత్రాంగం అన్నదాతల గ్రామాలలో ప్రజలకు మౌలిక ఏర్పాట్లలో ప్రభుత్వం తోపాటు,ప్లాంట్ యాజమాన్యం ఘోరంగా వైఫల్యం చెందిందని, మణుగూరు మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం దుర్గా మాట్లాడుతూ, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపన సమయంలో భూములు కోల్పో యిన ప్రభావిత గ్రామాల్లోని భూ నిర్వాసితులకు అలాగే,చిక్కుడు గుంట గ్రామ ప్రజ లు తమ భూములు, ఇళ్లు, ఆలయాలు, జీవనాధారాలు త్యాగం చేశారని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం మరియు ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు నేటి వరకు అమలు కాక నీటి మట్టాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కొరతను తొలగించేందుకు బీటీపీఎస్ యాజమాన్యం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు ప్రజలకు ఉపయోగపడకుండా నిర్వీర్యమైపోయన్నారు. గోదావరి నది నుండి వచ్చే కలుషిత నీరు తాగి ప్రభావిత గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రజలకు ఉపయోగించాల్సిన సి .ఎస్ .ఆర్ నిధులు పక్క జిల్లాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఓ వైపు ప్లాంట్ నుండి వెలువడే ఫ్లై యాష్, దుమ్ము, ఉద్గారాల వల్ల గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులతో పాటు, పంటల నష్టం వంటి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు మణుగూరు నుండి ఏటూరు నాగారం రహదారి, గ్రామ అంతర్గత రహదారులు దారుణంగా ఉన్నాయన్నారు. రోజువారీ ప్రయాణం ప్రాణహానికరంగా మారిందని, మౌలిక వసతుల లోపంతో కనీసం వీధి దీపాలు కూడా వెలగని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాలలో అప్రశుద్ధ వాతావరణంతో చెత్త, దోమల సమస్యలు ప్రజల కంటినిండా నిద్రపోని పరిస్థితి ఉందని ఇదేనా పాలకుల ఇచ్చిన అభివృద్ధి అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్లాంట్ యాజమాన్యం స్పందించి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి లాంటి యాజమాన్యం అందించే సి ఎస్ ఆర్ నిధులను నిర్వాసితుల గ్రామాలకు వినియోగించాలని ఆమె డిమాండ్ చేశారు.

# అక్షర యోధుడికి అత్యున్నత గౌరవం

**మొదటిపేజీ తరువాయి**

ఒక యుద్ధ గీతంలా మారి, గడప గడపకూ ఉద్యమ స్ఫూర్తిని తీసుకెళ్లిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆయన కవిత్వంలో ప్రధానంగా కనిపించేది తెలంగాణ అస్తిత్వ వేదన. కొన్ని దశాబ్దాల పాటు అణచివేతకు గురైన ఒక ప్రాంత భాషను, సంస్కృతిని తిరిగి వెలికితీసే ప్రయత్నం ఆయన రచనల్లో అడుగడుగునా కనిపిస్తుంది. యాసను కేవలం హాస్యానికి కాకుండా, భావ వ్యక్తీకరణకు బలమైన ఆయుధంగా మార్చవచ్చని ఆయన నిరూపించారు. 'భూమి స్వప్నం' నుంచి మొదలై 'సంభాషణ' వరకు ఆయన ప్రచురించిన ప్రతి కావ్యం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. నేటి తరం యువతకు కూడా అర్థమయ్యేలా సరళమైన శైలిలో గంభీరమైన విషయాలను చెప్పడం ఆయనకున్న ప్రత్యేక కళ.

సిధారెడ్డి పేరు వినగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది 'నాగేటి చాల్లల్లో నా తెలంగాణ' అనే పాట. ఈ ఒక్క పాట తెలంగాణ పల్లె జీవితాన్ని, కష్టాలను, ఆచారాలను అద్దం పడుతుంది. సినిమా పాటల్లో సైతం సాహితీ విలువలు లోపించకుండా, ప్రజల పక్షాన నిలబడే గీతాలను ఆయన అందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాహిత్య రంగానికి కొత్త ఊపిరి పోయడంలో ఆయన కృషి అమోఘం. ప్రభుత్వం స్థాపించిన తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, మరుగున పడిపోతున్న ఎందరో పాతతరం కవులను వెలుగులోకి తెచ్చారు.

సాహిత్యం అనేది కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అది సమాజాన్ని మార్చే ఒక పరికరమని సిధారెడ్డి బలంగా నమ్ముతారు. అందుకే ఆయన రచనల్లో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. పల్లెల్లో ఉండే కష్టజీవుల గోస, రైతుల ఆత్మహత్యల ఆవేదన, వలసల బాధ ఆయన కలం నుంచి కన్నీటి చుక్కలై రాలాయి. పర్యావరణ పరిరక్షణ పట్ల కూడా ఆయనకు ఎంతో మక్కువ. చెట్లు, గుట్టలు, వాగులు.. ఇవన్నీ ఆయన కవిత్వంలో సజీవ పాత్రల్లా మనకు



పలకరిస్తుంటాయి. మనిషికి మట్టికి ఉన్న విడదీయరాని బంధాన్ని ఆయన అద్భుతంగా ఆవిష్కరించారు. నందిని సిధారెడ్డి కేవలం కవి మాత్రమే కాదు, గొప్ప విమర్శకులు, పరిశోధకులు కూడా. ఆధునిక తెలుగు సాహిత్యంలో వస్తున్న మార్పులను ఆయన నిశితంగా గమనిస్తూ, కొత్తగా రాస్తున్న యువ కవులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. సాహిత్య సభల్లో ఆయన ప్రసంగాలు వింటుంటే ఒక విజ్ఞాన సర్వస్వం ముందు కూర్చున్న అనుభూతి కలుగుతుంది. ఎంతో క్లిష్టమైన విషయాలను కూడా సామాన్యులకు అర్థమయ్యేలా వివరించడం ఆయనకే చెల్లింది. గతాన్ని గౌరవిస్తూనే వర్తమాన సమస్యలపై గొంతు ఎత్తడం ఆయన నైజం.

తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను అనేక పురస్కారాలు ఆయన్ను వరించాయి. అందులో ముఖ్యంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఆయన కీర్తి కిరీటంలో ఒక కలికితురాయి. అయితే, ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పాకులాడలేదు. పాఠకుల ఆదరాభిమానాలే తనకు పెద్ద గుర్తింపు అని భావించే నిరాడంబర మూర్తి ఆయన. సిధారెడ్డి గారి ప్రభావం నేటి తరం కవులపై చాలా ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని గ్రామ గ్రామాన నేడు కొత్తగా పుట్టుకొస్తున్న కవులకు ఆయన ఒక స్ఫూర్తిప్రదాతగా, ఒక మార్గదర్శిగా నిలుస్తున్నారు. నేటి డిజిటల్ యుగంలో సాహిత్యం కనుమరుగవుతుందన్న ఆందోళన ఉన్న తరుణంలో, సిధారెడ్డి సోషల్ మీడియా వంటి మాధ్యమాలను కూడా సాహిత్య వ్యాప్తికి వాడుకోవాలని సూచిస్తుంటారు. యువత పుస్తక పఠనం వైపు మళ్లేలా ఆయన చేసే ప్రసంగాలు ఎంతో ఆలోచింపజేస్తాయి. సాహిత్యం అనేది ఒక జాతి చరిత్రను భద్రపరిచే భాండాగారమని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పదేపదే చెబుతుంటారు. తన అక్షరాల్లో నిప్పు కణికలను నింపి, అన్యాయంపై ఎక్కుపెట్టిన బాణంలా ఆయన కలం నిరంతరం సాగుతూనే ఉంటుంది.

ఆయనలోని సృజనాత్మకత కేవలం కవిత్వానికే పరిమితం కాలేదు. కథా రచయితగా కూడా ఆయన తన ముద్ర వేశారు. గ్రామీణ నేపథ్యం ఉన్న కథలను అల్లి, మనుషుల మధ్య ఉండే సంబంధాలను, ఆర్థిక ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు చూపారు. ఆయన కథల్లో పాత్రలు మన పక్కనే తిరుగుతున్నట్లు అనిపిస్తాయి. ప్రాంతీయతను ప్రేమిస్తూనే సార్వజనీనమైన మానవ విలువలను ఆయన బోధించారు. అందుకే ఆయన రచనలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఎంతగానో ఆకట్టుకుంటాయి. కాలంతో పాటు మారుతూ, తన శైలిని ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవడం ఆయనలోని గొప్పతనం. సిధారెడ్డి సాహిత్య ప్రస్థానంలో 'మంజీరా రచయితల సంఘం' స్థాపన ఒక కీలక ఘట్టం. ఈ సంఘం ద్వారా ఎందరో రచయితలను ఒకతాటిపైకి తెచ్చి, సాహిత్య చర్చలకు వేదికగా మార్చారు. సిద్ధాంతాల కన్నా మనుషుల వేదనకు ప్రాధాన్యత ఇచ్చే సాహిత్యం రావాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వేసిన పునాదుల మీదనే నేడు తెలంగాణలో ఒక బలమైన సాహిత్య సంస్కృతి కొనసాగుతోంది. నిరంతరం అధ్యయనం చేస్తూ, కొత్త విషయాలను నేర్చుకుంటూ తన కలాన్ని ఎప్పుడూ పదునుగా ఉంచుకోవడం ఆయనకు అలవాటు. నందిని సిధారెడ్డి కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక సాహిత్య ఉద్యమం.

# కాంగ్రెస్‌ను నిలదీస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌కు చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్థూపానికి వారు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు గొంతెత్తాయి. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. అమరవీరుల సాక్షిగా ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ గన్‌పార్క్ పరిసరాల్లో నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నేతలు చేసిన నినాదాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. 'రాహుల్ బంధు కాదు.. మాకు రైతుబంధు కావాలి' అంటూ వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రైతులకు రావాల్సిన పెట్టుబడి సాయాన్ని నిలిపివేసి, నిధులన్నింటినీ ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా, అన్నదాతల కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు సక్రమంగా అందేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారని, కానీ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ గాంధీ స్వయంగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ఆ చట్టబద్ధత ఏమైందని ఆయన నిలదీశారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, ఇప్పుడు హామీల అమలు విషయంలో వెనకడుగు వేస్తోందని దుయ్యబట్టారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పందిస్తూ, రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధు నిధులను నిలిపివేసి, ఢిల్లీకి నిధులు పంపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాహుల్ గాంధీ అవసరాల కోసం దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తామని అంటున్నారని, కానీ సొంత రాష్ట్ర రైతుల కష్టాలు మాత్రం పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే ఆరు గ్యారెంటీలకు పూర్తిగా మంగళం పాడినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును పక్కదారి పట్టిస్తూ తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని మహిళలు, రైతులు మహాలక్ష్మి మరియు రైతు భరోసా వంటి గ్యారెంటీల కోసం కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ వంటి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వారిని నట్టేట ముంచిందని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థత వల్ల ప్రతి వర్గం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా ఉండేదని కేటీఆర్ గుర్తుచేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా రైతుబంధు నిధులు ఆగకుండా అన్నదాతల ఖాతాల్లో జమ అయ్యేవని స్పష్టం చేశారు. కేసీఆర్ దార్శనికతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్ది కాంగ్రెస్‌కు అప్పగిస్తే, ప్రస్తుత ప్రభుత్వం దానిని అప్పుల కుప్పగా మార్చిందని తీవ్రంగా ఆరోపించారు. ఆదాయ వనరులను పెంచడం చేతగాక, అప్పులు తెచ్చి కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి కుంటుపడిందని, కొత్త ప్రాజెక్టులు రావడం లేదని విమర్శించారు.

పాలనాపరమైన వైఫల్యాల వల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల నిర్వహణ నుంచి సంక్షేమ పథకాల అమలు వరకు ప్రతిచోటా గందరగోళం నెలకొందని





వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైనప్పుడు ప్రతిపక్షంగా తాము మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు. గన్‌పార్క్ సాక్షిగా తాము చేస్తున్న ఈ పోరాటం కేవలం ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ వేదికగా ఆరు గ్యారెంటీల చట్టబద్ధతపై రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కేవలం అంకెల గారడీతో సరిపెట్టారని విమర్శించారు. సభలో ప్రతి అంశాన్ని లేవనెత్తుతామని, ప్రజల తరపున గొంతు వినిపిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముందుంటారని, సభను సజావుగా సాగనివ్వాలంటే ప్రభుత్వం హామీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకత్వం ఢిల్లీ ప్రయోజనాల కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీల సాధనలో కూడా ప్రభుత్వం విఫలమైందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై గట్టిగా అడగలేకపోతున్నారని విమర్శించారు. స్థానిక సమస్యలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ఇది తెలంగాణ ప్రజలకు చేస్తున్న తీరని ద్రోహమని ఆయన అభివర్ణించారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని అంకిరెడ్డి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మురికి కాలువల నిర్వహణ రోడ్ల పరిశుభ్రత అన్ని వార్డులలోని పనులను సమీక్షించుకొని గ్రామాన్ని పరిశుభ్రతలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేయాలని తెలియజేస్తూ వారు గ్రామానికి చేస్తున్న సేవ లు, కృషిని అభినందిస్తూ వారిని సత్కరించుకుంటూ, సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వలందాస్,మహేష్ గౌడ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్,పాలెం వెంకటేశం గౌడ్,ముద్దం లింగ స్వామి గౌడ్,దొడ్ల అండాలు శేట్టయ్య గౌడ్,దండుగల. వెంకటేశం,బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, రాపోలు రేణుక మల్లేశం , గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**ఏర్పాటు చేసిన కామారెడ్డిగూడెం సర్పంచ్**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం కామారెడ్డిగూడెం గ్రామంలో రంజన్ పండుగ ఉపవాస దీక్ష సందర్భంగా నేడు స్థానిక మాజీద్ లో ప్రత్యేక ప్రార్థన లు చేసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ రవి గారు మాట్లాడుతూ లౌకికవాద ప్రజాస్వామ్య దేశంలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సర్వనిలయంగా నెలకొన్నదిఅని,కేసీఆర్ గారు ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు రంజాన్ తోఫా,పెదేంటి ఆడ బిడ్డల పెళ్ళికి షాదిముబారక్,మైనారిటీ రుణాలు మరియు ముస్లింలకు ప్రత్యేక రెసిడెన్షియల్ రస్కూల్ ఏర్పాటుచేసి ముస్లింలు ఆర్థిక పురోగతి చెందడానికి ప్రత్యేక శ్రద్ధతో నాటి ప్రభుత్వం చొరవ తీసుకున్నారని కొనియాడారు ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరీ సోదరీమణుల కుటుంబాలలో అల్లా ఆశీర్వాదంతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో మత గురువు ఇనాయత్ రసూల్,మాజీ ఎంపీటీసీ మహమ్మద్ జాకీర్,ముస్లిం సోదరులు మహమ్మద్ ఖలీల్, గౌస్ పాషా,యాకుబ్ పాషా మహమ్మద్ ఖాజా నసీరుద్దీన్, అబ్బాస్, అజిత్ పాషా, షబ్బీర్, ఇస్మాయిల్, యూసుఫ్ పాషా,ఖలీల్ మౌలానా,పాషా,బిఆర్ఎస్ యువజన నాయకులు చింత.శేఖర్,ప్రవీణ్,అరుణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేసిన సర్పంచ్



**బయ్యారం, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామ పంచాయతీలో ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల వద్ద ముగ్గు వేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ స్వయంగా హాజరై లబ్ధిదారుల ఇళ్ల స్థలాల వద్ద ముగ్గు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని పేద కుటుంబాలకు ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు ప్రయోజనం చేకూరేలా గ్రామపంచాయతీ తరపున పూర్తిస్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పావని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో లబ్ధిదారుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చెరువు కింద కోట కాలువ శుభ్రత



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామంలోని చెరువు కింద ఉన్న కోట కాలువ కోట కాలువ గత రెండు సంవత్సరాలుగా పారుదల లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ నూతన సర్పంచ్ కొండ ఊర్మిళా మల్లారెడ్డి పనికి ఆహార పథకం ద్వారా ఈరోజు కాలువలు శుభ్రపరిచేపరులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువను శుభ్రపరచి సాగు నీరు పంట పొలాలకు సులభంగా చేరేలా చర్యలు తీసుకోవడం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, గ్రామ ప్రజలు తెలిపారు. రైతుల బాగోగులు దృష్టిలో పెట్టుకొని చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని, గ్రామస్తులు సర్పంచ్ ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు కరువు పనిలో పాల్గొన్న కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం ,సీత్యా తండాకు చెందిన గుగులోతు సీలిమజోగ్య దంపతుల కుమార్తె అరుణనాగన్న వివాహం వారి స్వగృహ ఆవరణలో జరుగగా ఆ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట బీమా నాయక్, బద్రు, యాకు, ఉపేందర్,మోహన్, ప్రవీణ్,అశోక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్రోజు చారి, ఆకుల సంతోష్, తోటకూరి మహేష్, కారుపోతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానం

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం ధరావత్ తండాలో గ్రామంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు ప్రతీ రోజు తండాను పరిశుభ్రంగా ఉంచుతూ తండావాసులు అనారోగ్యాలకు గురికాకుండా వాడలన్నీ పచ్చదనంగా ఉండేటట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ ధరావత్ అనిత రవీందర్ నాయక్. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కరుణాకర్, కారోబార్ బిక్కు,ఉప సర్పంచ్ బానోత్ కప్లి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ నాయక్, వార్డు సభ్యులు అమర్సింగ్, ధరావత్ రాజేష్, అమర్ సింగ్, గుగులోత్ రాజమణి, మధుకర్, మంజుల, రాజమణి, కిషన్,దేవు నాయక్, బానోత్ కిషన్, జోగు కలమ్మ, భూక్యా యాదమ్మ, అంగోత్ సోంప్లు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఒంటరవుతున్న అగ్రరాజ్యం?

- యుద్ధనౌకల పంపిణీపై అమెరికా విన్నపాన్ని తిరస్కరించిన 7 దేశాలు.
- హర్మూజ్ జలసంధికి నౌకలను పంపే ప్రసక్తే లేదని కేథరిన్ కింగ్ వెల్లడి
- సైనిక జోక్యంపై ఎవరికీ హామీ ఇవ్వలేదన్న ప్రధాని సనాయీ తకాయిచి
- పరిస్థితిని సమీక్షించాకే నిర్ణయం తీసుకుంటామన్న సియోల్
- లండన్‌లో భేటీ కానున్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ
- చమురు రవాణాపై ఆధారపడే ఆసియా దేశాలే భద్రత చూసుకోవాలని ట్రంప్ వ్యాఖ్య



**విశాలభారతి, అంతర్జాతీయం:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలు ఇప్పుడు అగ్రరాజ్యానికి, దాని చిరకాల మిత్రదేశాలకు మధ్య అగాధాన్ని పెంచుతున్నాయి. పశ్చిమాసియాలోని అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో యుద్ధనౌకలను మోహరించాలన్న ట్రంప్ ప్రతిపాదనకు దాదాపు ఏడు మిత్రదేశాలు గట్టి షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి వెన్నెముకగా నిలిచే ఈ జలసంధిలో భద్రత పేరుతో సైనిక మోహరింపు చేపట్టాలని అమెరికా భావిస్తుండగా, అందుకు సహకరించేందుకు ఆస్ట్రేలియా, జపాన్ వంటి దేశాలు ససేమిరా అంటున్నాయి. ఇరాన్ ప్రాబల్యం ఉన్న ఈ ప్రాంతంలో అనవసరంగా తలదూర్చి యుద్ధ వాతావరణాన్ని కొనితెచ్చుకోవడం ఇష్టం లేకనే ఈ దేశాలు వెనక్కి తగ్గుతున్నట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం ట్రంప్ విదేశీ విధానానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది.

ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత కఠినమైన నిర్ణయాన్ని ప్రకటించింది. హర్మూజ్ జలసంధికి గానీ, పశ్చిమాసియా ప్రాంతానికి గానీ తమ యుద్ధనౌకలను పంపే ఆలోచన లేదని ఆ దేశ కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ స్పష్టం చేశారు. అమెరికా నుంచి తమకు ఇంకా అధికారికంగా ఎటువంటి విన్నపాలు అందలేదని చెప్తూనే, ఒకవేళ వచ్చినా తమ వైఖరి మారబోదని ఆమె తేల్చి చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్యానికి హర్మూజ్ జలసంధి ప్రాధాన్యతను గుర్తిస్తున్నామని, అయితే నేరుగా సైనిక జోక్యం చేసుకోవడం వల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని ఆస్ట్రేలియా భయపడుతోంది. గతంలో అమెరికా పిలుపు మేరకు అనేక ఆపరేషన్లలో పాల్గొన్న ఆస్ట్రేలియా, ఇప్పుడు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

జపాన్ సైతం దాదాపు ఇదే బాటలో పయనిస్తోంది. జపాన్ నూతన ప్రధానమంత్రి సనాయీ తకాయిచి పార్లమెంటులో మాట్లాడుతూ, పశ్చిమాసియా సముద్ర జలాల్లో ఆయిల్ ట్యాంకర్ల రక్షణ కోసం తమ నౌకాదళాన్ని పంపే ప్రతిపాదనేదీ ప్రస్తుతం లేదని వెల్లడించారు. సైనిక జోక్యం విషయంలో తాము ఏ దేశానికి ముందస్తు హామీలు ఇవ్వలేదని ఆమె స్పష్టం చేయడం గమనార్హం. తమ దేశ చట్టపరమైన పరిధులు, సొంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే నిర్ణయాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రుడైన జపాన్, ఇప్పుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గకుండా తన స్వయంప్రతిపత్తిని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇది అగ్రరాజ్యానికి మింగుడుపడని విషయంగా మారింది.

దక్షిణ కొరియా వైఖరి కూడా అమెరికాకు పెద్దగా ఊరటనివ్వడం లేదు. ఈ అంశంపై అమెరికా ప్రతినిధులతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని ఆ దేశాధ్యక్ష కార్యాలయం తెలిపింది. అయితే, యుద్ధ నౌకలను పంపే విషయంలో తొందరపడబోమని, భౌగోళిక రాజకీయ పరిస్థితులను కూలంకషంగా సమీక్షించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ఉత్తర కొరియా నుంచి ఎదురవుతున్న ముప్పుల నేపథ్యంలో, తమ సైనిక శక్తిని పశ్చిమాసియాకు మళ్లించడం సరైనది కాదని దక్షిణ కొరియా రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాతో సంబంధాలు కాపాడుకుంటూనే, తన సొంత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సియోల్ భావిస్తోంది. దీనివల్ల ట్రంప్ ఆశించిన తక్షణ మద్దతు లభించడం కష్టంగా మారింది. యూరప్ దేశాల్లోనూ ట్రంప్ ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. హర్మూజ్ జలసంధి మూతపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని తెలిసినప్పటికీ, అమెరికా వెనుక గుడ్డిగా నడవడానికి ఆయన సిద్ధంగా లేరు. ఈ సమస్యపై ఇప్పటికే ఆయన కెనడా ప్రధాని మార్క్ కార్నీతో చర్చలు జరిపారు. పశ్చిమ దేశాలు, ఐరోపా దేశాలు ఒక కూటమిగా ఏర్పడి, ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్లాలని వారు భావిస్తున్నారు. ఈ మేరకు సోమవారం లండన్‌లో బ్రిటన్, కెనడా ప్రధానులు భేటీ కానుండటం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ ఒంటెత్తు పోకడలను నిలువరించేలా వీరి భేటీ ఉంటుందని సమాచారం. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ తన పంథాను మార్చుకోవడం లేదు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, హర్మూజ్ జలసంధిపై అమెరికా కంటే ఇతర దేశాలే ఎక్కువగా ఆధారపడుతున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా చైనా వంటి దేశాలు తమ చమురు అవసరాల కోసం ఈ మార్గాన్ని వాడుకుంటున్నాయని, కాబట్టి ఆ మార్గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా దేశాలదేనని ఆయన తేల్చి చెప్పారు. అమెరికా ఇప్పుడు స్వయం సమృద్ధి సాధించిందని, హర్మూజ్ మూతపడినా తమకు వచ్చే నష్టం తక్కువని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఎవరైతే ఆ మార్గాన్ని వాడుకుంటున్నారో, వారు తమ యుద్ధనౌకలను పంపి రక్షణ కల్పించుకోవాలని ఆయన వింత ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

ట్రంప్ వ్యూహం వెనుక ఒక పెద్ద రాజకీయ కోణం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆసియా దేశాలను పశ్చిమాసియా యుద్ధ మేఘాల్లోకి లాగడం ద్వారా అమెరికా తన భారాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా చైనాను ఈ వివాదంలోకి లాగడం ద్వారా ఆ దేశాన్ని ఆర్థికంగా, సైనికంగా బలహీనపరచవచ్చని ట్రంప్ యోచిస్తున్నట్లు కనిపిస్తోంది. అందుకే ఆయన తన ప్రసంగాల్లో చైనా పేరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. అయితే చైనా ఈ విషయంలో ఇంకా మౌనాన్ని వీడలేదు. అమెరికా అల్లిన వలలో పడకుండా ఉండేందుకు బీజింగ్ జాగ్రత్తపడుతోంది. ఇతర ఆసియా దేశాలు కూడా ట్రంప్ విసిరిన గాలానికి చిక్కేలా కనిపించడం లేదు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లను వణికిస్తున్నాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధి వద్ద చిన్నపాటి ఘర్షణ జరిగినా చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో మిత్రదేశాలను పక్కన పెట్టడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇటువంటి సంక్షోభాలు వచ్చినప్పుడు అమెరికా నాయకత్వం వహించేది, కానీ ట్రంప్ మాత్రం ఇతర దేశాలనే బాధ్యత తీసుకోమంటున్నారు. దీనివల్ల దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న సైనిక బంధాలు బీటలు వారుతున్నాయి. ట్రంప్ ఒత్తిడి పెరిగితే మిత్రదేశాలు ఏ మేరకు సహకరిస్తాయనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రస్తుతానికి ఏ ఒక్క ఆసియా దేశం కూడా ట్రంప్ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించలేదు. మిత్రదేశాల నుంచి అందుతున్న సమాధానాలు ట్రంప్ అహంకారాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. యుద్ధనౌకలను పంపడం అంటే ఇరాన్‌తో నేరుగా తలపడటమేనని, అది తమ దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని మెజారిటీ దేశాలు భావిస్తున్నాయి. అగ్రరాజ్యం తన శక్తిని చాటుకోవడానికి తమను పావులుగా వాడుకోవాలని చూస్తోందని ఆయా దేశాల రక్షణ శాఖలు అంతర్గత నివేదికల్లో పేర్కొంటున్నాయి. దీనివల్ల అమెరికా ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ట్రంప్ తన పంతాన్ని నెగ్గించుకుంటారా లేక మిత్రదేశాల మాట విని వెనక్కి తగ్గుతారా అనేది వేచి చూడాలి.

## డాక్టర్ కవిత రెడ్డి ప్రమాణస్వీకారం

**నిజామాబాద్, విశాలభారతి:**

ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ గా నిజామాబాదు నగరానికి చెందిన ప్రముఖ వైద్యురాలు కవితారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాదులోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ కార్యాలయంలో డాక్టర్ కవితా రెడ్డి చైర్మెన్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవితారెడ్డి మాట్లాడుతూ తనను ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు అందుకు కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి,నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు..ప్రజారోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు..ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతానన్నారు.హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్ ను మరింత అభివృద్ధి చేస్తానని డాక్టర్ కవితారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు ఆకుల లలిత,ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమి చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్,సహకార యూనియన్ చైర్మెన్ మోహన్ రెడ్డి,



మాజీ మేయర్ దర్మపురి సంజయ్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ,కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,రామర్తి గోపి,భక్తవత్సలం,కాకతీయ సంస్థల చైర్మెన్ రజనీకాంత్, ఫుట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పాల్గుణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బొబ్బిలి నర్సయ్య తదితరులు డాక్టర్ కవితారెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలికపై లైంగిక దాడి చేసి హత్య చేసిన దుండగుడు అరెస్ట



**రాజేంద్రనగర్, విశాలభారతి:** చాక్లెట్ ఇప్పిస్తానని ఆశ చూపించి ఓ బాలికపై లైంగిక దాడి చేసి అనంతరం హత్య చేసిన దారుణ ఘటన నర్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. సమాచారం ప్రకారం, బాలిక నిన్నటి నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిసర ప్రాంతాలలోని సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా, ఓ వ్యక్తి బాలికను తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వెంటనే ఆ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, బాలికపై లైంగిక దాడి చేసి అనంతరం హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిసింది ఆ తరువాత రాత్రి సుమారు 01:00 గంటల సమయంలో నిందితుడు బాలిక మృతదేహం ఉన్న ప్రదేశాన్ని చూపించాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కేశవరావు





**విశాలభారతి, కరకగూడెం:** మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా వెంకటాపురం సర్పంచ్ చౌలం కేశవరావు, ఉపాధ్యక్షుడిగా కన్నాయిగూడెం సర్పంచ్ కల్తీ విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 16 పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు. సర్పంచులందరికీ అండగా ఉంటూ, మండలంలోని గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు.

## వంద పడకల ఆసుపత్రిని పూర్తి చేయాలని ధర్నా

**గోశిక కరుణాకర్ సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి**




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి, వైద్యులను నియమించి, త్వరగా వైద్య సేవలు అందించాలని సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చౌటుప్పల్ లోని ప్రభుత్వ ఆసుపత్రి ముందర ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌటుప్పల పరిసర ప్రాంతాల లో 8 మండలాల ప్రజలు చౌటుప్పల్ ప్రాంతం నుండి హైవే రోడ్డు ఉండడంవల్ల, అనేక వాహన ప్రమాదాలు జరుగుతుండడంతో, ఇటు ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యము లేక, అటు హైదరాబాదుకు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేక ఆర్థిక భారం తో సరైన సమయానికి ఆసుపత్రికి చేరలేక మరణించడం జరుగుతుంది.ఆ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం 36 కోట్ల తో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడం జరిగింది. కానీ ప్రభుత్వం మరియు అధికారుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరాలు గడుస్తున్న ఆస్పత్రి ప్రారంభానికి నోచుకోలేక పోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వంద పడకల ఆసుపత్రిని నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అన్ని రకాల వైద్యులను, నియమించి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ ధర్నా లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వా రి రామేశ్వరి, చౌటుప్పల్ 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు, నాయకులు బండారు నరసింహ ,బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, ఆకుల ధర్మయ్య, కందగట్ల ఆనంద్, సప్పిడి శ్రీనివాసరెడ్డి, చికూరు ఈ దయ, ముగదాల రాములు, ఎండి జానీ, సోమరాజ్, యాదయ్య, పంతంగి సంధ్య సుర్వి వెంకటేష్ యాదమ్మ సుర్వి జయమ్మ పాల్గొనడం జరిగింది.

## క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికలు పూర్తి



**తిరుమలగిరి, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు 2026 27 విద్యా సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశమునకై ఆన్లైన్ లో అప్లై చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులకు తిరుమలగిరి మండల స్థాయిలో ఎంపికలు పూర్తి చేయడం జరిగింది. సెలెక్ట్ కాబడిన క్రీడాకారులను సూర్యాపేట జిల్లా స్థాయికి పంపడం జరుగుతుంది. అలాగే పెటటీఎస్ డైరీ లను ఆవిష్కరించడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి ఐ.శాంతయ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ , మరియు ఫిజికల్ డైరెక్టర్స్, మహేష్, అంబేద్కర్, రజిని,రాజీవ్, వెంకట్ పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచన**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025-26 కింద మూడు రకాల యూనిట్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ టూ వీలర్, ఎలక్ట్రికల్ త్రీ వీలర్ మరియు సోలార్ యూనివర్సల్ పంప్ సెట్ యూనిట్లకు రాయితీ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రికల్ టూ వీలర్ యూనిట్ ఖర్చు రూ.1 లక్ష కాగా అందులో 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంక్ లోన్ ఉంటుందని చెప్పారు. ఎలక్ట్రికల్ త్రీ వీలర్ యూనిట్ ఖర్చు రూ.3 లక్షలు ఉండగా అందులో 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంక్ లోన్ అందించబడుతుందని తెలిపారు. సోలార్ యూనివర్సల్ పంప్ సెట్ యూనిట్ సగటు ఖర్చు రూ.7 లక్షలు ఉండగా అందులో 60 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంక్ లోన్ అందించబడుతుందని వివరించారు. ఈ యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, ధ్రువ పత్రాల వివరాలు జిల్లా కలెక్టర్,చైర్మన్ జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతి యువకులు OBMMS పోర్టల్ ద్వారా మార్చి 17 నుండి 24 వరకు దరఖాస్తులు అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంపై గ్రామాలు, వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎంపీడీవోలు మరియు మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటి పై దాడి



**మేడిపల్లి విశాలభారతి:** హిందువులను కించపరిచే విధంగాఅనుచిత వాక్యాలు చేశారని ఆరోపిస్తూ తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు వ్యాఖ్యలను ఖండిస్తూ మేడిపల్లి బిజెపి, బి జె వై ఎం నాయకులు బోడుప్పల్ లోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా కోడిగుడ్లు, టమాటాలతో వారు ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సామేలు 24 గంటల్లో హిందువులకు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలక్షన్ సమయంలో మా ఆలయాల వద్దకు వచ్చి దండాలు పెట్టి నన్ను గెలిపించండి అని, ఈరోజు హిందువులను కించపరిచే విధంగా మాట్లాడటం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. బేషరతుగా వెంటనే క్షమాపణ చెప్పాలని లేనియెడల ప్రజలే నీకు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీసులు బీజేపీ, బీజేవైఎం నాయకులను అడ్డగించి పోలీస్స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సిల్వర్ కప్ గెలుచుకున్న ఎమ్మెస్ వైష్ణవి

**చదివే కాదు క్రీడలు కూడా ముఖ్యమే అంటున్న తల్లి స్మిత కోటేష్ గౌడ్**



**ముషీరాబాద్,విశాల భారతి:** 34వ ఫెడరేషన్ కప్పు త్రో బాల్ ఛాంపియన్షిప్ జాతీయ పోటీల్లో వైష్ణవి మురారి సిల్వర్ కప్పు సాధించింది. ఫెడరేషన్ ఆధ్వర్యం లో మెన్స్ అండ్ ఉమెన్స్ 2025 26 పేరిట తిరుపతిలో ఈ నెల 12 నుంచి 15 తేదీ వరకు జాతీయ స్థాయి త్రోబాల్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలకు తెలంగాణ నుండి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు స్మిత కోటేష్ గౌడ్ కూతురు ఎమ్మెస్ వైష్ణవి ఈ పోటీల్లో పాల్గొంది. ఇతర క్రీడాకారులతో పోటీపడి తన ప్రతిభను కనబరిచి త్రో బాల్ ఛాంపియన్షిప్ లో సెకండ్ ప్లేస్ లో నిలిచింది. దీనికిగాను ఫెడరేషన్ ప్రతినిధులు సిల్వర్ కప్పు మెమోటో తో సత్కరించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి 34వ ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొని సెకండ్ ప్లేస్ లో నిలిచి తెలంగాణకు వచ్చిన వైష్ణవిని బంధువులు స్నేహితులు పార్టీ నేతలు అభినందించి గ్రాండ్ గా వెల్కం పలికారు. అనంతరం స్మిత కోటేష్ గౌడ్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడల పట్ల మొగ్గు చూపే విధంగా తల్లితండ్రులు కృషి చేయాలని కోరారు.

## సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్ పనులకు శ్రీకారం

**సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాయి నగర్ కాలనీ 4వ వార్డులో మచ్చగొని కృష్ణ గౌడ్ ఇంటి నుండి వెంకటేశ్వర్లు ఇంటి వరకు నిర్మించనున్న సీసీ రోడ్ పనులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన ఈ సీసీ రోడ్ నిర్మాణం పూర్తయిన తరువాత కాలనీవాసులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలోని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి, తాటిపల్లి రమేష్ గౌడ్, మచ్చగొని మహేష్ ముదిరాజ్, బోడుసు రాఘవేందర్ యాదవ్, గడ్డమీద దేశరథ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, తొర్పునూరి శివ గౌడ్, బత్తిని దీపిక, నాగరాజు గౌడ్, దర్శనం యాదయ్య, లింగాల శ్రీలత, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, మందుగుల శ్రీశైలం గౌడ్, అంతటి అశోక్ గౌడ్, గ్రామ పెద్దలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్టు :** పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని, ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రోజు అబ్దుల్లాపూర్ మెట్టు మండల ఎంఆర్వో కార్యాలయం ముందు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. యుద్ధం వద్దు - శాంతి ముద్దు అనే నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరల కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రపంచ శాంతిని కాపాడే దిశగా ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ (DT) కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, కాటి అరుణ, వట్టి నవనీత, పున్నాల యాదగిరి, భైరగోని రాజు, మధు, సైదులు ముదిరాజ్, మంగళపల్లి రవి, రమేష్‌నాయక్, పేరాల గోపి, దేవమ్మ, క్రాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సీపీఆర్, ఫైర్ అవగాహన సదస్సులు

**సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి**



**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో ATG హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్ (CPR) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు సీపీఆర్ విధానం ఎంత ముఖ్యమో నిపుణులు వివరించారు. అలాగే అదే పాఠశాలలో ఫైర్ అవగాహన సదస్సును కూడా నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలి, అగ్నిమాపక పరికరాల వినియోగం వంటి అంశాలపై ఫైర్ సిబ్బంది ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దవీటి అర్చన అజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. అలాగే ఫైర్ స్టేషన్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, ఫైర్ ఫైటర్ గోపాల్ మరియు ఫైర్ సిబ్బంది హాజరై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మరియు గ్రామస్తులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## మందుల సామెల్ ఇంటి పై దాడిని ఖండించిన నత్తి మైసయ్య



**బోడుప్పల్, విశాలభారతి:** హిందువులను కించపరిచే విధంగా మాట్లాడడని తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటి పైన బిజెపి నాయకులు కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేశారు. ఈ సంఘటనను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య తీవ్రంగా ఖండించారు. దళిత ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటి పైన, ఆడవారి పైన దాడి చేయడం హేయమైన చర్య పని, నిజంగా మందుల సామెల్ అభ్యంతరకరం వ్యాఖ్యలు చేసి ఉంటే ప్రెస్ మీట్ లో ఖండించాలి, శాంతియుతంగా నిరసన తెలుపాలి అంతేకానీ ఇంటిని ముట్టడించడం, ఆడవాళ్లను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, మందుల సామాన్లు ఇంటిపై దాడి చేసిన బిజెపి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని నత్తి మైసయ్య డిమాండ్ చేశారు.

# తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- **ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మూడేళ్ల కాలయాపన**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకి బిజెపి నేతల వినతి**

**మేడిపల్లి, విశాలభారతి:**




కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తుక్కుగూడ వేదిక గా రాష్ట్ర ప్రజలకు 6 గ్యారెంటీలు ప్రకటించి వాటిని ప్రవేశపెట్టడంలో ఘోర విఫలమైంది, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మాయమాటలు చెప్పి మోసపూరిత హామీలతో ఓట్లు దండుకొని ఏ ఒక్క గ్యారెంటీని కూడా నెరవేర్చకుండా 3 సంవత్సరాలు కాలయాపన చేస్తుంది. ఈ సందర్భంగ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడిపల్లి ఎమ్మార్వో కు, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజాకు బోడుప్పల్, పీర్జాదిగూడ భారతీయ జనతా పార్టీ నాయకులు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలు విషయంలో ప్రభుత్వం వెనుకంజ వేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడం ప్రభుత్వం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో మహిళల సంక్షేమం, రైతులకు మద్దతు, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత వంటి ముఖ్య అంశాలు ఉన్నాయని గుర్తు చేశారు. అయితే ఆ గ్యారంటీల అమలు విషయంలో ఇప్పటికీ స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని, ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు, కానీ ప్రస్తుతం ఆ ఆశలు నెరవేరకపోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోందని, ప్రజలను మోసగించిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ ఈస్ట్ జోన్ బిజెపి అధ్యక్షులు ఏర్పుల మహేష్, పీర్జాదిగూడ (వెస్ట్) బీజేపీ అధ్యక్షుడు రాంపల్లి యాదగిరి గౌడ్, బిజెపి నాయకులు నమలికొండ అనిల్ రెడ్డి, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్, ఉపాధ్యక్షులు శరత్ చంద్ర రెడ్డి, రాజిరెడ్డి, బజ్జోరి శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకులు సంధ్యా రెడ్డి, విజయ రెడ్డి ,రాధిక, బొద్దు సంధ్య పాల్గొనడం జరిగింది.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి




- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**
- **సమయపాలన పాటించాలని అధికారులకు ఆదేశం**

**నిజామాబాద్, విశాలభారతి:**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్ లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇదిలాఉండగా, ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు కొంత ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్, ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం అయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటల వరకు అధికారులు అందరూ హాజరు అయి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం



**విశాలభారతి, పెద్దపల్లి:**

గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి నేరాలను నివారించేందుకు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో రాంపల్లి గ్రామంలో సైబర్ మోసాలు,రోడ్డు భద్రత మరియు రాష్ & నెగ్లిజెంట్ డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సీఐ మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో సహకరిస్తూ చట్టాలను పాటిస్తే నేరాలను సమర్థవంతంగా తగ్గించవచ్చని తెలిపారు.గ్రామస్థులకు సైబర్ నేరాల నుండి ఎలా జాగ్రత్తపడాలి, అనుమానాస్పద ఫోన్ కాల్స్,ఓటీపీలు, లింకులు ఇతరులతో పంచుకోకూడదని వివరించారు.అదే విధంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించడం,హెల్మెట్ వినియోగం,అతివేగం మరియు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.గ్రామంలో మద్యపానం నిషేధం అమలు చేయాలని,బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామ అభివృద్ధి మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని పోలీసులు అభినందించారు.రాంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలు కూడా మద్యపాన నిషేధం అమలు చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సీఐ కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీడీఓ, పీహెచ్‌సీ డాక్టర్, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 200 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## చంద్రపూర్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం




**నిర్వహించిన జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు**

**విశాలభారతి, రామగుండం:**

సోమవారం జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ జి.సి. వినయ్ గౌడ, ఎస్పీ ముమ్మక సుదర్శన్ జాతీయ ఎస్సీ కమీషన్ సంచాలకులు డా.జి.సునీల్ బాబు ల తో కలిసి జిల్లాలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. సభ్యులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. అని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.ఎస్సి కార్పొరేషన్ క్రింద నూతన లబ్దిదారులకు పథకాలను అందించాలి.ఎస్సీ ఎస్టీ కేసులలో తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.కుల ధ్రువీకరణ పత్రం మరియు ఇండ్ల పట్టాలు అందించాలి. రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ,ఎస్సీ వర్గాల నిరుపేదలకు అందించేలా కృషి చేయాలి. గృహనిర్మాణం లేదా గృహనిర్మాణ యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. చాలా సంవత్సరాల నుండి ఎస్సీ కాలనీ బస్తీలలో నివసిస్తున్న ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, కుల ధ్రువీకరణ పత్రం అందించాలని కలెక్టర్ ని ఆదేశించారు.స్కీములపై ఎస్సీ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ దీనిపై దృష్టి సారించాలని అన్నారు ,బ్యాక్ లాగ్ ఖాళీలు వివరాలు కమిషన్ కు రిపోర్ట్ అందజేయాలన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలు అమలు పరచాలి

**బిజెపి అధ్యక్షులు బౌద్ధ నగర్ పి. సాయిప్రసాద్ గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను గద్దె దించాలని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు పరచాలని బిజెపి బౌద్ధ నగర్ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సోమవారం ముషీరాబాద్ మండల తహసిల్దార్ రాణా ప్రతాప్ సింగ్ కి డివిజన్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు స్కూటీలు పెళ్లి అయినవారికి తులం బంగారం విద్యార్థులకు ఫీజు మినహాయింపు 500 రూపాయలు గ్యాస్ సిలిండర్ నెలకు 2500 ఆర్థిక సాయం రైతులకు పంట సహాయం 15000 వృద్ధాప్య పింఛన్ 4000 వరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు పరచాలని సాయిప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు కార్యక్రమంలో నాగరాజు. వెంకట చైతన్య.సుబ్బారావు. గంజి నవీన్. కుమార్. నీలేష్. జయంత్. సాయి. రూప్ సాయి. సోను. తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యలపై పోరాడాలి



**సికింద్రాబాద్, విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ బౌద్ధ నగర్ మున్సిపల్ డివిజన్ బీజేపీ కమిటీని జిల్లా బిజెపి అధ్యక్షులు భరత్ గౌడ్ ,జిల్లా ఇన్చార్జ్ నందనం దివాకర్ల ఆదేశాల మేరకు డివిజన్ బిజెపి అధ్యక్షులు పి.సాయి ప్రసాద్ గౌడ్ పదాధికారులను నియమించారు.రానున్న రోజులలో డివిజన్లో బిజెపిని పార్టీ పరంగా ప్రజలతో మమేకమై జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపొందే విధంగా ముందుకు నడిపించాలని పదాధికారులను కోరుతూ క్రింది కమిటీని ప్రకటించడం జరిగింది. డివిజన్ బిజెపి పదాధికారులు ఉపాధ్యక్షులుగా జె. వెంకట చైతన్య,టి. సుబ్బారావు, కె. భాస్కర్ గౌడ్, ఈ. యాదమ్మ, ప్రధాన కార్యదర్శులుగా బి.నాగరాజు, వనమాల కిరణ్ కార్యదర్శులుగా గంజి నవీన్, ప్రభావతి, సాయి ప్రసాద్, జి. బిక్షపతి, కోశాధికారిగాడి. రాజుల ను ప్రకటించారు.

## ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**సర్పంచ్ బాదావత్ కబ్లి పుల్య నాయక్**



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బాదావత్ కబ్లి పుల్య నాయక్ ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి గ్రామ అభివృద్ధే తన ధ్యేయమని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. గ్రామంలోని ప్రతి వీధి అభివృద్ధి చెందేలా రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. మనరేగా పథకం ద్వారా గ్రామ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. సర్పంచ్ బాదావత్ కబ్లి పుల్య నాయక్ సేవా దృక్పథంతో పని చేస్తూ గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు ప్రశంసించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత వల్ల బంచరాయితండ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కల్పన భరత్, గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్ విజయ్, పార్టీ సీనియర్ నాయకులు బాదావత్ పుల్య, ఉమ్మడి కొత్తూరు జి ఉపసర్పంచ్ సేట్యి, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సింగరేణి గ్యాస్ గోడౌన్ లో ఆకస్మిక తనిఖీలు



**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు సింగరేణి గ్యాస్ గోడౌన్ లో సోమ వారం నాడు సివిల్ సప్లై డిటి శివకుమార్ హెచ్పీసీఎల్ సేల్స్ మేనేజర్ పవన్ కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మరియు స్టాక్ రిజిస్టర్లను ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కస్టమర్లకు సకాలంలో సిలిండర్లు అందుతున్నాయా లేదా అన్న వివరాలు తెలుసుకొని కస్టమర్లకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో గ్యాస్ సరఫరా చేయాలని తగు సూచనలు చేశారు. అదేవిధంగా సివిల్ సప్లై డ్యూటీ శివకుమార్ మణుగూరు పట్టణంలోని పలు గ్యాస్ కంపెనీలను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్లైన్ బుకింగ్ తో కస్టమర్లకు సకాలంలో సరఫరా అవుతుందా లేదా అన్న విషయాన్ని స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించి గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్కు కు తరలించకుండా జాగ్రత్తలు పాటించాలని గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్కు తరలిస్తే డీలరు మరియు తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## మంత్రి పొంగిలేటితో భేటీ అయిన ఎమ్మెల్యే పాయం

**పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**



**బూర్గంపాడు, విశాలభారతి:** పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మరియు మీడియా మిత్రులు మంత్రి నివాసంలో సోమవారం పలు అభివృద్ధి పనులపై భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి పినపాక నియోజకవర్గం అభివృద్ధిలో తన వంతు కృషి ఎప్పటికీ ఉంటుందని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని నిత్యం ప్రజల్లో ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం కోరిన అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

**కార్మికులకు వైద్య పరీక్షలు**



**అశ్వారావుపేట, విశాలభారతి:** ప్రజా సేవలో నిత్యం శ్రమించే మున్సిపల్ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అశ్వారావుపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి జూపల్లి శశికళ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మున్సిపల్ కార్మికులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. రోజూ శ్రమించే కార్మికులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని వైద్యులు సూచించారు. శిబిరంలో పాల్గొన్న కార్మికులకు రక్తపోటు, చక్కెర స్థాయిలు వంటి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పాల్గొని కార్మికులతో మాట్లాడారు. పట్టణ శుభ్రత, ప్రజా సేవలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. వారి ఆరోగ్యం బాగుంటేనే సేవలు మరింత మెరుగ్గా అందించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులకు నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం సేవా కార్యక్రమంగా నిలిచిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రాజశేఖర్‌కు బెస్ట్ సర్వీసు సొసైటీ అవార్డు



**బూర్గంపాడు, విశాలభారతి:** భూర్గంపాడు మండలం సారపాకకు చెందిన పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ బహుజన సాహిత్య అకాడమీ (బియస్ఏ) జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు .సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ముత్తవరపు రాజశేఖర్ చేస్తున్నా సేవలకు గాను బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి లో మేము చేస్తున్న సేవలకు గాను మొదటి అవార్డు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసు వారి నుండి సేవారత్న అవార్డు పొందాను, ఇప్పుడు రెండో అవార్డు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు ను బహుజన సాహిత్య అకాడమీ వారి చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది అని, ఎనిమిది సంవత్సరాలుగా మేము చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేసిన బహుజన సాహిత్య అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తు లో ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేస్తాము అని, అందరికీ ఆదర్శంగా నిలుస్తాము అని తెలియజేశారు

## గిరిజన విద్యార్థుల భాషా అభివృద్ధికి మరో అడుగు



**పాల్వంచ, విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ మరో విశిష్టమైన శాస్త్రీయ విజయాన్ని సాధించింది. కళాశాలలో హిందీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డా. టి. అరుణ కుమారి కి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ నుండి ప్రతిష్టాత్మకమైన మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ మంజూరైంది. డా. అరుణ కుమారి పరిశోధన అంశం "ఆదివాసి విద్యార్థుల హిందీ భాషా అభ్యాసంలో ఉన్న సవాళ్లు మరియు వాటి పరిష్కారాలు: బహుభాషా, సామాజికసాంస్కృతిక అధ్యయనం" అనే ప్రాధాన్యమైన అంశంపై కొనసాగనుంది. గిరిజన విద్యార్థులు హిందీ భాషను నేర్చుకునే సమయంలో ఎదుర్కొనే భాషా, సామాజిక మరియు సాంస్కృతిక అడ్డంకులను విశ్లేషించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం. గిరిజన ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి, భాషా బోధనలో నూతన విధానాలు తీసుకురావడంలో ఈ పరిశోధన కీలక పాత్ర పోషించనుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక సంస్థ అయిన ఐ సి ఎస్ ఎస్ ఆర్ ఈ ప్రాజెక్ట్‌ను మంజూరు చేయడం ద్వారా కళాశాల విద్యా ప్రతిష్టను మరింతగా పెంచింది. ఈ సందర్భంగా కళాశాల పోలారపు పద్మ, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు డా. అరుణ కుమారిని అభినందిస్తూ, ఈ పరిశోధన గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి మార్గదర్శకంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యా రంగానికి ఇది ఒక గొప్ప గుర్తింపుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ఉక్కు శాఖ మంత్రితో యన్. యమ్. డీ. సి స్పాంజ్ ఐరన్

**యూనిట్ పాల్వంచ ప్లాంట్ పునరుద్ధరణకు చర్చిస్తా.. యంపి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి**

**పాల్వంచ, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఖాయిలా పడ్డ యన్. యమ్. డీ. సీ ప్లాంట్ ను పునరుద్ధరణ కు కేంద్ర ఉక్కుశాఖా మంత్రి డి. కుమారస్వామితో మాట్లాడి అపాయింట్మెంట్ తీసుకుంటానని, రంజాన్ తర్వాత ఢిల్లీకి రావల్సిందిగా ఐ. యన్. టీ. యూ. సి రాష్ట్ర ఉపాధ్యక్షులు జలీల్, పాల్వంచ 33 వ డివిజన్ కార్పొరేటర్ బాలు నాయక్ లకు సూచించారు. సోమవారం యం. పి సూర్యాపేట కు వచ్చిన సందర్భంగా జలీల్, బాలు నాయక్ ప్లాంట్ పరిస్థితి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమే వారికి హామీ ఇచ్చారు. ప్లాంట్ ను పునరుద్ధరించి యువతకు ఉపాధి కల్పించాల్సిందిగా అభ్యర్థించారు. ముందుగా రేణుకాను మర్యాద పూర్వకంగా కలసి, సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఐ. యన్. టీ. యూ. సి రాష్ట్ర ఉపాధ్యక్షులు, భద్రాద్రి కొత్తగూడెం జాల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ జలీల్, పాల్వంచ 33 వ డివిజన్ కార్పొరేటర్, పాల్వంచ పట్టణ ఐ. యన్. టీ. యూ. సి అధ్యక్షులు బానోత్ బాలు నాయక్, ఐ. యన్. టీ. యూ. సి పాల్వంచ పట్టణ ప్రధాన కార్యదర్శి శనగ రామచందర్ రావు, యువ నాయకుడు బానోత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.





# నల్గొండ పట్టణంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు



విశాలభారతి: రాబోయే మూడేండ్లలో నల్గొండ పట్టణంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నల్గొండలోని క్లాక్ టవర్ సెంటర్ మదీనా మజీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏకైక సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ కులమతాలను రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. సంవత్సరానికి 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ఆర్ హయాంలోనే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యాయని గుర్తు చేశారు. నల్లగొండ పట్టణంలో గత 30 సంవత్సరాలుగా హిందూ ముస్లింలంతా కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకుంటున్నారని అన్నారు. ముస్లింలంతా రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థుల అభివృద్ధికి ఆత్మ బలమే ఆలంబన



**విశాలభారతి, కరకగూడెం:** మండలం, ఎంపీపీఎస్ రేగళ్ల పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు టి సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పాఠశాల 48 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ మరియు షూస్, అందజేస్తూ, విద్యార్థులు బాల్యం నుండే, ఆత్మవిశ్వాసాన్ని ఆత్మ బలాన్ని కలిగి ఉండి లక్ష్యం దిశగా ఒత్తిడి లేని సాధన చేయాలని, మహనీయుల జీవితాలు ఎవరివి పూల పాన్పు కాదని, ఇప్పుడున్న సమయంలో చదువుని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఆ దిశగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కరకగూడెం మండల ఎంఈఓ గడ్డం మంజుల మాట్లాడుతూ మంచి ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు డాక్టర్ సారంగపాని క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ మరియు షూ బహుకరించడం అభినందనీయమని డాక్టర్ సారంగపాణి గారిని ఆదర్శం తీసుకొని ఇంకా దాతలు ముందుకు రావాలని కోరారు. బట్టుపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ టి మోహన్ బాబు మాట్లాడుతూ విద్యార్థి వేసుకునే డ్రెస్ వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని, తన ఆత్మ న్యూనత భావాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. రేగళ్ల సర్పంచ్ బాడిశ పార్వతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం కోసం మా వంతు సహకారాన్ని అందిస్తామని, వారి అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు, జన విజ్ఞాన వేదిక స్టేట్ కల్చరల్ సెక్రటరీ లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఇంకా గ్రామీణ స్థాయిలో అధికంగా జరగాలని అందుకు సారంగపాణి గారు మార్గదర్శకులుగా ఉంటారన్నారు. యోగా గురువు యోగి రాంబాబు విద్యార్థులకు యోగాలోని వివిధ రకాల ఆసనాలను నేర్పించి, విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసాన్ని పెంపుందేలా వారికి శిక్షణ ఇచ్చారు. అనంతరం డాక్టర్ సారంగపాణి మాదన్న గూడెం ఆదివాసులను సందర్శించి వారికి పోషక విలువలు లోపించడం వల్ల వచ్చే అనర్థాలు గూర్చి అవగాహన కల్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కుమారస్వామి, మల్లేష్, విద్యార్థుల తల్లిదండ్రులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ తిరుపతిరావు, వసంతరావు పాల్గొన్నారు.

## క్రీడాకారుల పోటీలను ప్రారంభించిన
# ఎన్ టీ పి సి సీఎస్ఆర్



**విశాలభారతి, ఎన్ టీ పిసి:** రామగుండం, కమాన్‌పూర్, అంతర్గం మరియు పాలకుర్తి మండలాల నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం గ్రామీణ క్రీడా పోటీల ప్రారంభోత్సవాన్ని ఎన్ టీ పి సి సీఎస్ఆర్ నిర్వహిస్తుంది. నాలుగు మండలాల నుండి మొత్తం 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఈ క్రీడా పోటీలలో పాల్గొంటున్నాయి. గ్రామీణ పాఠశాల విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం మరియు సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న కార్యక్రమాలలో వాలీబాల్ మరియు ఖోఖో ఉన్నాయి. ప్రారంభోత్సవంలో జనరల్ మేనేజర్ (O&M తెలంగాణ) శ్రీ ముకుల్ రాయ్, హెచ్ ఆర్ అధిపతి శ్రీ బిజోయ్ కుమార్ సిక్దార్ మరియు డిప్యూటీ జనరల్ మేనేజర్ హెచ్ ఆర్ శ్రీ ప్రవీణ్ కె. చౌదరి పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, ఎన్ టీ పి సి సీఎస్ఆర్ బృందం సభ్యులు మరియు పాల్గొనే పాఠశాలల నుండి ఫిజికల్ డైరెక్టర్లు లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్య మరియు క్రీడల ద్వారా సమాజ అభివృద్ధి మరియు యువత సాధికారత పట్ల NTPC యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తూ విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల నుండి ఈ కార్యక్రమం ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి క్రీడా ప్రతిభను గుర్తించి, పెంపొందించడానికి గ్రామీణ క్రీడా మీట్ ఒక విలువైన వేదికను అందిస్తుందని భావిస్తున్నారు.

## రోడ్ సేఫ్టీ వాలంటీర్ల కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం



**విశాలభారతి:** చైతన్య భారతీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , హైదరాబాద్‌లో సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ వాలంటీర్లు కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా యువతలో రోడ్ సేఫ్టీపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం, సమాజంలో సురక్షిత రోడ్ల వినియోగంపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. అధ్యాపకులు మాట్లాడుతూ, యువత రోడ్డు భద్రతా నియమాలను పాటించడం మాత్రమే కాకుండా సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించడంలో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు మాట్లాడుతూ, విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యాసంస్థలు సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కాజీపేట రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి



**విశాలభారతి, వరంగల్:** కాజీపేట రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణలో రైల్వే వసతుల అభివృద్ధిపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్వరం వినిపించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైల్వే మంత్రిత్వ శాఖ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఎంపీ పాల్గొని తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఔషధ పరిశ్రమలు, పారిశ్రామిక రంగాల్లో వేగంగా ఎదుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని రైల్వే మౌలిక వసతులు ఆ స్థాయిలో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటాల ఊతంగా కార్యరూపం దాల్చుతున్న రైల్వే మాన్యు ఫాక్చరింగ్ యూనిట్ లో స్థానికులకు ఉపాధి ఉద్యోగావకాశాలు తప్పనిసరిగా కల్పించాలని ఆ దిశగా జరిగే అన్ని ప్రయత్నాలకు తాను నాయకత్వం వహిస్తానని స్పష్టం చేసారు. దేశంలోనే అత్యంత రద్దీగా మారిన కాజీపేట జంక్షన్‌ను డీకాంజెస్ట్ చేయడం అత్యవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో కాజీపేటలో ప్రతిపాదిత రైల్ అండర్ రైల్ టన్నెల్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌ను తక్షణమే ప్రారంభించాలని కోరారు. పరిపాలనా సౌలభ్యం కోసం కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే జోన్, బలమైన సబ్ జోన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్‌ను చెన్నై, బెంగళూరు, పుణే నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్వే కారిడార్ల ప్రకటనను స్వాగతించిన ఎంపీ డా. కడియం కావ్య, వాటి అమలు కోసం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించి పనులు వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణలో వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు ట్రాక్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని కూడా ఎంపీ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని తెలిపారు.

## ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

**విశాలభారతి, హనుమకొండ** : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాల ప్రాంగణం వద్ద సోమవారం తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదానశిభిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా హనుమకొండ కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ విచ్చేసి ప్రారంభించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఈ గొప్ప సేవా కార్యక్రమమైన రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన జిల్లా పరిపాలనకు అభినందనలు తెలియజేశారు. రక్తదానం మానవత్వానికి అందించగల అత్యున్నత సేవలలో ఒకటని, ఒక యూనిట్ రక్తం అనేక అమూల్యమైన ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. ప్రత్యేకంగా వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని, అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆరోగ్యంగా జీవించడానికి తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుందన్నారు. వారికి రక్తం కేవలం అవసరం మాత్రమే కాదని, వారి ప్రాణాధారమని పేర్కొన్నారు.



# గడపల తోరణాలే గంతులు వేసెనుగా

'కొమ్మ కొమ్మలో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ.. ఎచ్చని ఎలుగు సీరే కట్టే సక్కంగ.. ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగా.. గడపల తోరణాలే గంతులు వేసెనుగా.. పూవుల పరిమళాలే గాలులు వీచెనుగా.. ముస్తాబవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు.. చిన్నాపెద్దల్లోన మొదలయ్యేను జాతర జోరు..' అంటూ పల్లెల్లో జరిగే శివరాత్రి పర్వదినాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అక్షయ్‌రామ్ పొదిశెట్టి, సంగీతం: వంశీకాంత్ రేఖన

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.